PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 104 | విజయవాడ, శనివారం 16 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 16 November 2024 | Rs

సెబి నిష్పాక్షికతపై నీలి నీడలు

- అదానీ – బచ్ వ్యవహారంలో కానరాని పారదర్శకత
- కీలక ప్రశ్నలకు సమాధానాలు దాటవేత

7



3-1తో సిరీస్ భారత్ కైవసం

దక్షిణాఫ్రికాపై 135 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

8



వామపక్ష కూటమి నేతలతో కలిసి అభివాదం చేస్తున్న అనూర దిసనాయకే (కుడి నుంచి రెండో వ్యక్తి)

శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో

లెఫ్ట్ ప్రభంజనం

- జెవిపి నేతృత్వ కూటమికి మూడింట రెండొంతుల మెజార్టీ
- తమిళ ప్రాబల్య ప్రాంతాల్లోనూ కొనసాగిన జోరు
- ప్రత్యర్థి కూటమిలో మట్టి కరచిన హేమాహేమీలు

కొలంబో: శ్రీలంక మరో చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన 10వ పార్లమెంటు ఎన్నికల్లో జనతా విముక్తి పెరమున (జెవిపి) నేతృత్వంలోని వామపక్ష కూటమి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి)కి ప్రజలు మూడింట రెండొంతుల మెజార్టీతో అఖండ విజయం చేకూర్చారు. ఎన్నికల సంఘం వెల్లడించినదాని ప్రకారం మొత్తం 225 స్థానాలు ఉన్న పార్లమెంటులో 159 సీట్లలో ఎన్‌పిపి విజయ దుందుభి మోగించింది. సమీప ప్రత్యర్థి సజిత్ ప్రేమదాస నేతృత్వంలోని సామాగి బలవేగయా (ఎస్‌జెబి) 40 సీట్లకే పరిమితమైంది. మిగతా పార్టీలేవీ సింగిల్ డిజిట్ దాటలేదు. ఎన్‌పిపి ప్రభంజనానికి డజనుకు పైగా మాజీ మంత్రులు మట్టి కరిచారు. దేశాధ్యక్షులు అనూర కుమార దిసనాయకె ఆర్థిక, రాజకీయ రంగాల్లో తేనున్న మార్పులకు శ్రీలంక ప్రజలు పూర్తి మద్దతు పలికారు. తమిళులు అధికంగా ఉండే ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో సైతం ఎన్‌పిపి స్పష్టమైన ఆధిక్యత సాధించడం ద్వారా తనపై ఉన్న సింహళ జాతీయవాది అన్న ముద్ర మిగతా 7లో

మొత్తం స్థానాలు 225

సాధారణ మెజార్టీ : 113
నేరుగా ఎన్నిక జరిగిన స్థానాలు : 196
దామాషా పద్ధతిన ఎన్నిక జరిగినవి : 29
జెవిపి నేతృత్వంలోని ఎన్‌పిపి :159
ఓటింగ్ శాతం : 61.6
ఎస్‌జెబి : 40
ఓటింగ్ శాతం : 17.78
ఇలంకాయ తమిళ అరసు కచ్చి : 8
ఓటింగ్ శాతం : 2.3
న్యూడెమొక్రాటిక్ ఫ్రంట్ : 5
ఓటింగ్‌శాతం : 4.5
శ్రీలంక పొదు జన పెరమున : 3
ఓటింగ్ శాతం : 3.1
సర్వజన బలయా : 1
ఓటింగ్ శాతం :1.6

ఆశలు నెరవేరుస్తాం

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం
- గత ప్రభుత్వ అప్పులు, తప్పులే రాష్ట్రానికి శాపం
- బడ్జెట్‌పై చర్చలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మూడురోజుల పాటు జరిగిన చర్చలో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని నెరవేరుస్తాం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం' అని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు, పాపాలు, నేరాలే రాష్ట్రానికి శాపంగా మారాయని సిఎం అన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత పాలకులు ఐదేళ్లకాలంలో రూ.9,74,556 కోట్ల అప్పులు చేశారని చెప్పారు. ఈ అప్పులు ఇంకా బయటపడుతున్నాయని, ఐపి పెట్టి వెళ్లిపోతే ప్రామిసరీనోట్లు తీసుకుని అప్పులోళ్లు వచ్చినట్టు అప్పు ఖాతాలు ఇంకా బయటపడుతూనే ఉన్నాయని చెప్పారు. తాము రూ.6 లక్షల కోట్లు అప్పులు చేసినట్లు వైసిపి వారే చెబుతున్నారని, అయితే వాస్తవం అది కాదని అన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం చేసిన అప్పులను ఆయన వివరించారు. ప్రభుత్వ అప్పులే రూ.4.35 లక్షల కోట్లు మిగతా 7లో

73 పథకాలను పునరుద్ధరించాం

శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

2



భూదురాక్రమణ నిషేధ బిల్లు-2024పై

అన్ని పక్షాలతో సంప్రదించండి

- శాసనసభలో ఆమోదించడానికి ముందే చర్చ జరపండి
- ముఖ్యమంత్రికి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

భూదురాక్రమణ నిషేధ బిల్లు–2024ను రాష్ట్ర శాసనసభలో ఆమోదించడానికి ముందే అన్ని పక్షాలతో సంప్రదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాసిన లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ఈ బిల్లులోని కొన్ని అంశాలు పేదలపైన, పేదలపక్షాన నిలబడే ప్రజా ఉద్యమాలను అణచి వేయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని తొలగించి అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకొన్న దురాక్రమణదారులకు శిక్ష విధించేలా, పేదలకు న్యాయం చేకూర్చేలా సవరించాలని కోరారు. లేఖ పూర్తి పాఠం :

'మన రాష్ట్రంలో భూ దురాక్రమణలు సంకటమైన సమస్యగా ఉన్నాయని అనేకమంది భూయజమానులు తీవ్రమైన కష్టాలు పడుతున్నారని, అంతేగాకుండా పట్టణీకరణ, వ్యాపారీకరణ పారిశ్రామికీకరణ ప్రాథమిక ఉత్ప్రేరకాలుగా ఉన్నాయని పేర్కొంటూ, ఈ నేపథ్యంలో భూదురాక్రమణను అరికట్టడానికి 1982 చట్టాన్ని రద్దుచేసి, ఆ స్థానంలో భూదురాక్రమణ నిషేధ చట్టం 2024ను శాసనసభలో మీరు ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తరహాలో ఈ చట్టం చేయాలని ప్రయత్నించి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. మీరు దాన్నే కొనసాగించడం సముచితం కాదు. ఈ బిల్లు చట్టరూపం తీసుకోకముందే వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలతో సహా అఖిలపక్ష సమావేశం జరిపి అభిప్రాయాలు తీసుకొని తుదిరూపం ఇవ్వాలని కోరుతున్నాను. రెండున్నర ఎకరాల మాగాణి, ఐదు ఎకరాల మెట్టలోపు సొంత భూములు మిగతా 7లో



ప్రమాదం జరిగిన ఝాన్సీ మెడికల్ కళాశాల వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

యుపిలో ఘోరం

- ఝాన్సీ మెడికల్ కాలేజీలో భారీ అగ్నిప్రమాదం
- 10 మంది నవజాత శిశువులు మృతి

ఝాన్సీ : బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్‌లోని మరోఘోరం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని ఝాన్సీ పట్టణంలోని మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించి పది మంది నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోని (ఎస్‌ఎన్‌సీయూ) వార్డులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగిన వార్డులో 47 మంది నవజాత శిశువులు ఉన్నారు. ఘటన జరిగిన వెంటనే 31 మంది నవజాత శిశువులను సురక్షితంగా తరలించినట్టు అధికారులు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిశువుల మృతితో ఆస్పత్రి ఆవరణలో హృదయవిదారక వాతావరణం నెలకొంది. తమ బిడ్డలు సురక్షితంగా ఉన్నారా.. లేదా అని తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని అధికారులు భావిస్తున్నారు. మిగిలిన రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో వసతులు, ఫీజుల వివరాలు వెబ్‌సైట్‌లో..

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో వసతులు, ప్రభుత్వం ఆమోదించిన ఫీజులు వంటివి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల జీతం, వారి అర్హతలు, గుర్తింపు మొదలైన వివరాలను ఉంచేలా చేయాలని రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని, తదుపరి విచారణను డిసెంబర్ 4న చేపడతామని ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్ట నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం ఆమోదించిన ఫీజు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల జీతం, వారి అర్హతలు, గుర్తింపు తదితర వివరాలను అధికారిక వెబ్‌సైట్లో పాఠశాల విద్యాశాఖ పొందుపరిచేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు.

మధ్యప్రదేశ్‌లో బిజెపి గూండాగిరి

- ఉప ఎన్నికల్లో ఓటు వేయలేదని దళితులపై దాడి,
- ఇళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం, అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



బిజెపి గూండాల విధ్వంసానికి దగ్ధమవుతున్న దళితుల ఇళ్లు

భోపాల్ : అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో బిజెపి గూండాలు రెచ్చిపోయారు. రాష్ట్రంలో బుధవారం జరిగిన విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయలేదని దళితులపై దారుణంగా దాడికి దిగారు. వారి ఇళ్లను తగులబెట్టారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పోలింగ్ జరిగిన బుధవారం రాత్రే నియోజకవర్గంలోని గోహ్రా గ్రామంలో ఈ దారుణం జరిగింది. బుధవారం రాత్రి సుమారు 200 మంది బిజెపి గూండాలు దళితులు ఎక్కువగా నివాసం ఉండే గ్రామంపై దండెత్తారు. కనిపించిన దళితులపై రాళ్లు విసురుతూ, ఇతర ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. అలాగే వారి ఆస్థులను కూడా ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్, ఇళ్లను తగుల బెట్టారు. గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన పూర్తి వివరాల ప్రకారం.. విజయ్‌పూర్ ఉప ఎన్నికల్లో బిజెపి నుంచి రామ్‌నివాస్, కాంగ్రెస్ నుంచి ముఖేష్ మల్హోత్రా పోటీ చేశారు. నిజానికి రామ్‌నివాస్ గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే తరువాత బిజెపిలోకి చేరారు. రాష్ట్ర మంత్రి వర్గంలో అటవీ శాఖ సహాయ మంత్రి పొందారు. అయితే నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమయింది. కాంగ్రెస్‌లో నుంచి బిజెపిలోకి చేరిన రామ్‌నివాస్ నిర్ణయాన్ని ఇక్కడ గ్రామ ప్రజలు ముందు నుంచి వ్యతిరేకిస్తున్నారు. అతనికి మద్దతు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో ఎన్నికకు రెండు రోజుల ముందు కూడా బిజెపి గూండాలు ఓటర్లను బెదిరించడానికి ప్రయత్నించారు. తుపాకీతో కాల్పులకు తెగబట్టారు.

ఈ ఘటనలో ముగ్గురు దళితులకు గాయాలు కూడా అయ్యాయి. అయినా కూడా ప్రజలు రామ్‌నివాస్‌కు మద్దతు ఇవ్వడానికి ముందురాలేదు. బుధవారం జరిగిన పోలింగ్‌లో బిజెపికి అనుకూలంగా ఓటు వేయలేదని ఆ పార్టీలు గూండాలు రాత్రి గ్రామంపై దండెత్తారు. విధ్వంసం సృష్టించారు. ఈ ఘటనతో గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామంలో మోహరించారు. భద్రత పెంచారు. బిజెపి గూండాల దాడులపై దళితులు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకూ ఒక్కర్నీ కూడా పోలీసులు అరెస్టు చేయలేదు.

నాసిరకం మద్యంతో

ప్రాణాలు కోల్పోయిన ప్రజలు

- గత ప్రభుత్వ హయాంలో సరఫరా
- ఇప్పుడూ అదే సరుకు ఉంది
- శాసనమండలిలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో మద్యం తయారీ కంపెనీలు నాసిరకం మద్యాన్ని ప్రజలకు అందించిందని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ మద్యం తాగి వేలాది మంది పలు వ్యాధులతో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. గత ప్రభుత్వం అవసరానికి మించిన బ్రాండ్లు పెట్టడం వల్ల షాపుల్లో పాత సరుకే ఉందన్నారు. త్వరలో టెండర్లు పిలిచి కొత్త సరుకు తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ గురించి వైసిపి సభ్యులు దువ్వాడ శ్రీనివాస్, తూమాటి మాధవరావు, రాజగొల్ల రమేష్ యాదవ్ ప్రశ్నోత్తరాల సమయంలో శుక్రవారం మంత్రిని అడిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుడి, బడికి 100 మీటర్లలోపు మద్యం షాపులను ఏర్పాటు చేయబోమని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ముగిసిందన్నారు. త్వరలోనే సిబిసిఐడి విచారణ జరుగుతుందని, కుంభకోణంలో ఉన్న ప్రధాన సూత్రధారులు అందరూ బయటకు వస్తారని మాధవరావు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

వైద్య కళాశాలలపై వాగ్వాదం... వైసిపి వాకౌట్

రాష్ట్రంలో వైద్య కళాశాలల ఏర్పాటుపై మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, నిర్మాణానికి నిధులు, ఖర్చు వివరాల గురించి టిడిపి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్.. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని మంత్రి సమాధానంగా చెప్పారు. పులివెందుల, మార్కాపురంలలో ఏర్పాటుచేసిన కళాశాలలను ఎందుకు ప్రారంభించలేదని అనుబంధ ప్రశ్నగా శ్రీకాంత్, రామ్‌గోపాల్ రెడ్డి అడిగారు. ఇటీవల జాతీయ వైద్య మండలి రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంలో మౌలిక సదుపాయాలు, బోధన సిబ్బంది, భవనాలు లేవనే కారణంతో మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పాడేరు కళాశాలలకు అనుమతి నిరాకరించారని మంత్రి తెలిపారు. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. మంత్రులు రాజకీయ ఉపన్యాసాలు చేయడం సరికాదని, గౌరవంగా సమాధానంగా చెప్పాలని అన్నారు. వ్యక్తిగతంగా మాట్లాడి సభను పక్కదారి పట్టించే విధంగా ఇచ్చిన సమాధానానికి నిరసనగా తాము వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. జిఓ 107, 108, సెల్ఫ్ ఫైనాన్స్ కింద సీట్లను కొనసాగిస్తారా? లేదా కన్వీనర్ సీట్లు కింద కొనసాగిస్తారో చెప్పాలని అడిగిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వైసిపి సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్ ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పలేదు.

26 బిలియన్ డాలర్ల విక్రయం

- రూపాయి పతనం కట్టడికి ఆర్‌బిఐ నిర్ణయం

6

వచ్చే విద్యా సంవత్సరం నాటికి మెగా డిఎస్‌సి పూర్తి

- విద్యాశాఖ మంత్రి లోకేష్

2

యురేనియం బోర్ల తవ్వకాల చర్యలు నిలిపివేయాలి

- అటవీ శాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

3

జిఎస్‌టి పెంపునకు అనుమతివ్వండి

- ఢిల్లీ పర్యటనలో కేంద్రాన్ని కోరిన చంద్రబాబు
- ఒక శాతం సర్‌ఛార్జీ మోపేందుకు ప్రతిపాదన
- గోదావరి – పెన్నా అనుసంధానికి సహకరించాలని విజ్ఞప్తి
- అమరావతిలో సింగపూర్ భాగస్వామ్య పునరుద్ధరణకు వినతి
- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జైశంకర్‌తో భేటీ



నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో విజయవాడ సహా పలు ప్రాంతాల్లో వరదలు సంభవించిన కారణంగా ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు రాష్ట్ర వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)ని ఒక శాతం పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రముఖ వార్తా సంస్థ 'హిందూస్తాన్ టైమ్స్' శత వార్షికోత్సవ సభలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. విజయవాడ వరదల్లో నష్టపోయిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పినతో సహా నష్టాన్ని పూడ్చేందుకు జిఎస్‌టిపై ఒక శాతం సర్‌ఛార్జ్ విధించడానికి మిగతా 7లో

విఆర్ఎ, 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

104 ఉద్యోగులు, విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఛైర్మన్ మోషేను రాజు దృష్టికి శుక్రవారం తీసుకొచ్చారు. విఆర్ఎలకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా పేస్కేల్ అమలు చేయాలని, నామినీ విఆర్ఎలను విఆర్ఎలుగా పరిగణించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్హతల ఆధారంగా అర్హులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. జాబ్‌చార్టుకు విరుద్ధంగా రాత్రిపూట విధులు, ఇసుక, రైస్‌మిల్స్ వద్ద విధులు నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 104 డ్రైవర్లను, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అరబిందో యాజమాన్యం నుంచి తప్పించాలని కోరారు. ప్రతినెలా ఒకటిన జీతాలు చెల్లించాలని, అరబిందో చెల్లించాల్సిన మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను వెంటనే ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ వాటా యాజమాన్యం చెల్లించాలని కోరారు. వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్సులు చేయించాలన్నారు.

ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డులను సరిచేయాలి

ఆన్‌లైన్‌లో ఉన్న రెవెన్యూ రికార్డుల్లో తప్పుడు సమాచారాన్ని సరిచేయాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు సచివాలయంలో కలిసి కోరారు. ప్రజల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారానికి తేడా ఉందని తెలిపారు. ఎకరం పొలం ఉన్నవారికి తక్కువగా, ఎక్కువగా చూపుతోందని పేర్కొన్నారు.

టైమ్‌కు రండి

- మంత్రి వాసంశెట్టికి స్పీకరు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తొలి ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్ణీత సమయానికి సభకు రాకపోవడంపై స్పీకరు అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ... టైమ్‌కు రండి అని సూచించారు. సభకు మంత్రులు ఆలస్యంగా వస్తే ఎలా అని వాసంశెట్టి సుభాష్‌ను ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం సభలో ప్రశ్నోత్తరాల సమయానికి మంత్రి సుభాష్ రాలేదు. అనంతరం వచ్చిన మంత్రికి సకాలంలో సభకు వచ్చేందుకు ప్రయత్నించాలని స్పీకరు అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆలస్యానికి క్షమాపణ చెప్పిన మంత్రి.. సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

ఎస్‌బిఐ రుణ వడ్డీ రేట్లు పెంపు

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన రుణ గ్రహీతలపై మరింత భారం మోపనుంది. రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్ ఆధారిత రుణ రేట్లను (ఎంసిఎల్ఆర్) 0.05 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. మూడు, ఆరు నెలల కాలావధుల ఎంసిఎల్ఆర్‌ను కూడా పెంచినట్లు తెలిపింది. ఏడాది కాలానికి ఎంసిఎల్ఆర్‌ను 0.05 శాతం మేర పెంచి 9 శాతానికి చేర్చినట్లు వెల్లడించింది. పెంచిన వడ్డీ రేట్లు నవంబర్ 15 నుంచే వర్తిస్తాయని తెలిపింది.

రిజర్వేషన్లకు సంబంధం లేకుండా హోంగార్డుల రాత పరీక్షకు అనుమతించండి : హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో తమను ప్రత్యేక కేటగిరిగా పరిగణించాలంటూ హోంగార్డులు వేసిన పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా హోంగార్డులను దేహధారుడ్య, తుది రాత పరీక్షకు అనుమతించాలని పోలీసు నియామక బోర్డుకు ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేస్తూ జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక, మతపరమైన రిజర్వేషన్లు వర్తింపజేసి ప్రిలిమినరీ పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్ మార్కులు రాలేదంటూ తమను తదుపరి ప్రక్రియకు అనర్హులు చేయడాన్ని సవాల్ చేస్తూ పలువురు హోంగార్డులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ సుబ్బారెడ్డి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పిటిషనర్లను తదుపరి ప్రక్రియలైన దేహధారుడ్య పరీక్షకు, తుది రాత పరీక్షకు అనుమతించాలని పోలీసు నియామక బోర్డును ఆదేశించారు.

సిసి కెమెరాల ఏర్పాటు వివరాలివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు ఏ మేరకు చేశారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. స్టేటస్ రిపోర్టును అందజేయాలని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశించింది. అన్ని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని 2015లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ 2019లో పిల్ దాఖలు చేశారు. దశలవారీ సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని చెప్పింది. పిల్‌ను మూసివేసింది. అయితే ఇప్పటికీ పలు పోలీస్‌స్టేషన్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయలేదని, దీనిని కోర్టు ధిక్కారంగా పరిగణించాలంటూ యోగేష్ 2022లో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిని తాజాగా విచారించిన హైకోర్టు పై విధంగా వివరాలు కోరింది.

పరిశ్రమల ఏర్పాటులో రిజర్వేషన్లు ఏవీ?

- మండలిలో వైసిపి సభ్యుల ప్రశ్న
- ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్రోత్సాహకాలిస్తామన్న ప్రభుత్వం



మండలిలో మాట్లాడుతున్న మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమల ఏర్పాటులో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారా? లేదా? అన్న విషయాన్ని ప్రకటించాలని శాసనమండలిలో వైసిపి సభ్యులు పట్టుబట్టారు. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల విధానాన్ని మంత్రి టిజి భరత్ శుక్రవారం మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా విపక్షనేత బొత్స సత్యనారాయణ, సభ్యులు రవిబాబు, రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూములు తీసుకుని ప్రైవేటు వ్యక్తులు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. అలా ఏర్పాటవుతున్న పరిశ్రమల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు 10 శాతం అదనంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ఛైర్మన్ మోషేను రాజు మాట్లాడుతూ సభ్యులు అడుగుతున్న ప్రశ్న వేరని, పరిశ్రమల ఏర్పాటులో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ కల్పిస్తారా? అనే అంశాన్ని స్పష్టం చేయాలని కోరారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని సమాధానమిస్తూ పారిశ్రామిక పాలసీ గతంలో ఉన్నదేనని అన్నారు. దాని ప్రకారం రిజర్వేషన్లకు అవకాశం ఉందన్నారు. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులలో మాత్రం రిజర్వేషన్ విధానం ఉండదని, వీటిలో ఎస్‌సి, ఎస్‌టిలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే సాధారణంగా ఇచ్చే పోత్సాహకాల కంటే వీరికి 10 శాతం అదనంగా ఇస్తామన్నారు. అంతకుముందు మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎఫ్‌డిఐలకు అవకాశం ఇస్తున్నామని, ఈ రంగంలో ఏడాదికి 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటులో ప్రోత్సాహకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. పరిశ్రమలు కల్పించే ఉద్యోగాల ఆధారంగా వాటికి తగిన ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఇ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీపై ప్రకటన చేసిన ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. అంతకుముందు ఇంధన శాఖ మంత్రి ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీపై సభలో ప్రకటన చేశారు. ఈ పాలసీలో పునరుత్పాదక ఇంధన శక్తిని గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు..

రాజధానిలో భూ కేటాయింపులపై సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిలో వివిధ సంస్థలకు భూముల కేటాయింపుపై మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో చర్చించింది. మంత్రులు పయ్యావుల కేశవ్, పి నారాయణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, టిజి భరత్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాజధానిలో సంస్థలకు భూముల కేటాయింపుపై సమావేశంలో చర్చించారు. గతంలో ఏయే సంస్థలకు ఎంతెంత భూములు కేటాయించామనే దానిపై పరిశీలించామని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సమావేశం తరువాత వెల్లడించారు. గతంలో భూములు కేటాయించిన సంస్థలతో చర్చించాలని సిఆర్‌డిఎ అధికారులను ఆదేశించామన్నారు. గత ప్రభుత్వం మూడు ముక్కలాటతో భూములు పొందిన సంస్థలు నిర్మాణానికి ముందుకు రాలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి వారికి నమ్మకం వచ్చిందని అన్నారు. గతంలో మధ్యలో నిలిచిపోయిన పనుల టెండర్లు రద్దుపై కమిటీ నివేదికను వచ్చే కేబినెట్‌లో పెడతామన్నారు. కేబినెట్ ఆమోదం తర్వాత రీ టెండర్లు పిలుస్తామన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. అమరావతిలో ప్రాజెక్ట్ వేగవంతం చేయాలని నిర్ణయించామన్నారు. గతంలో భూములు కేటాయించిన సంస్థలు త్వరగా నిర్మాణాలు ప్రారంభించేలా వారితో సంప్రదింపులు జరుపుతామని తెలిపారు. అందరినీ పిలిచి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రతి పది రోజులకోసారి సబ్ కమిటీ సమావేశం అవుతుందన్నారు.

టైమ్‌కు రండి : వాసంశెట్టికి స్పీకరు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తొలి ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్ణీత సమయానికి సభకు రాకపోవడంపై స్పీకరు అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ... టైమ్‌కు రండి అని సూచించారు. సభకు మంత్రులు ఆలస్యంగా వస్తే ఎలా అని వాసంశెట్టి సుభాష్‌ను ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం సభలో ప్రశ్నోత్తరాల సమయానికి మంత్రి సుభాష్ రాలేదు. అనంతరం వచ్చిన మంత్రికి సకాలంలో సభకు వచ్చేందుకు ప్రయత్నించాలని స్పీకరు అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆలస్యానికి క్షమాపణ చెప్పిన మంత్రి.. సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

కరువు బాధితులకు రూ.159 కోట్లు మంజూరు

- మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువు మండలాల్లో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.159.27 కోట్లు మంజూరు చేసిందని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. 5 జిల్లాల్లో 54 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించామని, 1.06 లక్షల హెక్టార్ల పంట నష్టం జరిగిందని, 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని సభ్యులు రామ్‌గోపాల్ రెడ్డి, దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులను ఆదుకునేందుకు రూ.159.27 కోట్లను త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే అని, ఈ నెల 28వ తేదీలోపు పూర్తిస్థాయిలో అంచనాలు వేసి కరువు బారిన పడినవారికి ప్రభుత్వం సాయం చేస్తుందని వెల్లడించారు. కరువు మండలాలపై జిల్లా కలెక్టర్లు నివేదికలు అందిస్తున్నా విపత్తుల నిర్వహణశాఖ ప్రకటించడం లేదని రామ్‌గోపాల్ రెడ్డి అన్నారు. 16 మండలాల్లో కరువు తీవ్రంగా ఉందని కడప కలెక్టరు నివేదికలు పంపినా వాటిని ప్రకటించలేదన్నారు. జిల్లా కలెక్టర్లు నివేదికలు పంపినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొందుపరిచిన మార్గదర్శకాల ఆధారంగా కరువు మండలాలు ప్రకటిస్తారని మంత్రి చెప్పారు. కడప కలెక్టరు పంపిన నివేదికలను మరోసారి పరిశీలిస్తామన్నారు.

సభ్యుల రాజీనామాలు ఆమోదించండి

ఛైర్మన్‌ను కోరిన మంత్రి అచ్చెన్న

శాసనమండలి సభ్యత్వాలకు చేసిన రాజీనామాలను వెంటనే ఆమోదించాలని ఛైర్మన్ కె మోషేను రాజును మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. బల్లి కళ్యాణ చక్రవర్తి, పోతుల సునీత, కర్రి పద్మశ్రీ రాజీనామాలు సమర్పించారన్నారు. సరైన ఫార్మేట్‌లో లేదని, ఆవేశంలో చేశారని మీరు ఆమోదం చెప్పలేదని సమాచారం తనకు ఉందన్నారు. సభలో మీ ముందే రాజీనామా చేసినట్లు వెల్లడించారని, కాబట్టి వెంటనే ఆమోదించాలని ఛైర్మన్‌ను కోరారు. సంప్రదాయం ప్రకారం సభలో తెలియజేస్తే వెంటనే ఆమోదించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వైసిపి ఫిర్యాదు చేస్తే ఇందుకూరి రఘురాజును వెంటనే డిస్క్వాలిఫై చేశారని పేర్కొన్నారు. విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ..

అధికారం ఉంది కదా అని సభ్యులను మభ్యపెట్టి, బలవంతంగా రాజీనామాలు చేయించిన సంప్రదాయం గతంలో ఎప్పుడూ లేదన్నారు. మీ విచక్షణ, అధికారాలను ఉపయోగించి ఈ విషయంపై ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన ఛైర్మన్‌ను కోరారు. రాజీనామాలు తన పరిశీలనలో ఉన్నందున తగిన నిర్ణయం తీసుకుంటానని ఛైర్మన్ స్పష్టం చేశారు.

వచ్చే విద్యా సంవత్సరం నాటికి మెగా డిఎస్‌సి పూర్తి

- విద్యాశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మెగా డిఎస్‌సి ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటి, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు.

1994 నుంచి పడిన కేసులను పరిశీలించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. డిఎస్‌సికి ఎంత మేరకు వయో పరిమితి మినహాయింపు ఇచ్చేది త్వరలోనే తెలియజేస్తామని, జిఒ 117కు త్వరలోనే ప్రత్యామ్నాయం తీసుకొస్తామని చెప్పారు. దీనిలో భాగంగానే ఉపాధ్యాయ సంఘాలతో అనేక పర్యాయాలు చర్చించినట్లు తెలిపారు. భీమిలి నియోజకవర్గం పద్మనాభ మండలం మధురవాడ – తగరపువలస ప్రాంతంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటుకు అవకాశం లేదని సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

గిరిజన నివాస ప్రాంతాల అనుసంధానం : మంత్రి గుమ్మడి సంధ్యారాణి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గిరిజన ప్రాంత జనావాసాల అనుసంధానం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 2,162 అనుసంధానం లేని జనావాసాలను గుర్తించామన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ 100కు పైగా జనాభా కలిగివున్న 499 పివిటిజి జనావాసాలను అనుసంధానం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్‌ల సదుపాయాన్ని పునరుద్ధరిస్తామని, జనన నిరీక్షణ సదనాలను సమకూర్చుతామని చెప్పారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వ్యయం రూ.17,050.20 కోట్లు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి అంచనా వ్యయం రూ.17,50.20 కోట్లుగా ఉందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.



ఈ ప్రాజెక్టు ద్వారా ఎనిమిది లక్షల ఎకరాలకు గోదావరిలో వచ్చే వరద నీరు 63.20 టిఎంసిలు మళ్లించే అవకాశం ఉందని చెప్పారు.

కార్మిక బీమా పరిధిలోకి 25 లక్షల మంది : మంత్రి వాసంశెట్టి సుభాష్

హోటల్స్, ఆక్వా సంస్థలు, ఇతర పరిశ్రమల్లో ఎంతమంది కార్మికులు పనిచేసేది నిర్ధారించేందుకు కార్మికశాఖ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పది మందికి పైగా పనిచేస్తున్న సంస్థలను కార్మికశాఖ పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్రంలో 14 లక్షల 55 వేల మంది కార్మికులు కార్మిక బీమా పరిధిలో ఉన్నారని, రెండు సంవత్సరాల్లో 25 లక్షల మందిని బీమా పరిధిలోకి తీసుకొస్తామని తెలిపారు. 20 వేల మందికిపైగా కార్మిక బీమా సభ్యులున్న ప్రాంతాల్లోనే 30 పడకల ఇఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు అవకాశం ఉంటుందని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఘనంగా బాలోత్సవం ప్రారంభం

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- 200 పాఠశాలల నుండి 15 వేల మంది హాజరు



ప్రజాశక్తి – విజయవాడ అర్బన్

అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ శుక్రవారం విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది. అమరావతి బాలోత్సవం అధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే పిల్లల పండుగను సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ బాలోత్సవంలో సుమారు 200 పాఠశాలల నుండి 15 వేల మందికిపైగా విద్యార్థులు భాగస్వాములై ఆయా రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. జానపద, క్లాసికల్ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, చిట్టి చేతులతో మట్టి బొమ్మలు చేయడం వంటి వివిధ రకాల పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలకు వేదికగా ఉన్న సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. వివిధ అంశాల్లో పోటీపడటానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి వేలాది మంది హాజరయ్యారు. పోటీల్లో భాగంగా సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఆరు వేదికలను ఏర్పాటు చేశారు. కల్చరల్ విభాగంలో తొలిరోజు జానపద నృత్యం, ఫాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, క్లాసికల్ డ్యాన్స్, లఘు నాటిక, దేశ భక్తి గీతాలు వంటి అంశాల్లో పోటీలు జరిగాయి. వీటితోపాటు కార్టూన్, పోస్టర్ ప్రెసెంటేషన్, వ్యాసరచన, అంతర్జాలంలో అన్వేషణ, స్పెల్ బి, ఉత్తరం రాయడం విభాగాలలో పోటీలు నిర్వహించారు. కల్చరల్ విభాగంలో నిర్వహించిన విచిత్ర వేష ధారణ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

దేశ నాయకులు, ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలను విద్యార్థులు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల వేష భాషలతో విద్యార్థులు జానపద నృత్యాలను చక్కగా ప్రదర్శించారు. సందేశంతో కూడిన అంశాలను తీసుకుని చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు, క్రెడాయి విజయవాడ అధ్యక్షులు దాసరి రాంబాబు, పివిఆర్ గ్రూప్ మేనేజింగ్ పార్టనర్ తుమ్మల వంశీ, ప్రముఖ ఇంజనీర్ వంగర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాజాతా బృందం సభ్యులు

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు

- అన్నమయ్య జిల్లాలో సాగిన సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కళాజాతా

ప్రజాశక్తి – రాయచోటి టౌన్

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం తగదని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షులు సుజాత అన్నారు. ఆ సంఘం జోనల్ 13వ మహాసభ బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా "ప్రజాధనం-ప్రజా వినియోగం కోసం" అనే నినాదంతో హైదరాబాద్ నుంచి చేపట్టిన కళాజాతా శుక్రవారం అన్నమయ్య జిల్లాలో కొనసాగింది. రాయచోటిలోని బంగ్లా సర్కిల్‌లో కళాజాతా ప్రదర్శించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య, సుజాత మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. వీటిని ప్రభుత్వంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలు బలపడాలంటే ప్రజలు వాటిలో పొదుపు చేయాలని కోరారు. జాతీయ, గ్రామీణ బ్యాంకుల పనితీరుతో ప్రజల మద్దతు కొనసాగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను పాటలు, నృత్యాల ద్వారా కళాజాతా బృందం ప్రజలకు వివరించింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, ఎల్ఐసి యూనియన్ నేతలు వేణుగోపాల్ రాజు, ఆదినారాయణరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్, కెవిపిఎస్, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మదనపల్లి ఎస్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో కళాజాతా ప్రదర్శించారు.

వైసిపి నిలిపివేసిన 73 పథకాలను పునరుద్ధరించాం

- శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం వచ్చే నిధులతో అమలు చేయాల్సిన 93 పథకాలను వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందని,వాటిలో 73 పథకాలను తమ ప్రభుత్వం ఇప్పటికే పునరుద్ధరించిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు శుక్రవారం ఆయన జవాబిస్తూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని విమర్శించారు. చట్టసభల అనుమతి లేకుండా నిధులను ఖర్చు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. చట్ట సభల అనుమతి లేకుండా రూ.634 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ చెప్పిందన్న మంత్రి గుర్తు చేశారు.

వైసిపి హయాంలో పారిశ్రామిక వేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోయారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు చంద్రబాబు కష్టపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఎలా పిలవాలో కూడా తెలియడం లేదన్నారు. దేనికీ సరైన లెక్కలు లేవని, అంకెల గారడీతో గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ వైఖరితో ఎంతోమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని పయ్యావుల ఆవేదన వ్యక్తం చేశారు. 'అమరావతి విధ్వంసం, విశాఖ భూ దోపిడీ మీ అరాచకం కాదా?' అని మంత్రి వైసిపిని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా పక్కనపెట్టిందని అన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదన్నారు.

3 బిల్లులకు ఆమోదం

రాష్ట్ర శాసనసభ శుక్రవారం మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (సెకండ్ అమెండ్‌మెంట్ బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంటు (న్యాయాధికారుల పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ అప్రాసియేషన్ ఓటాన్ అకౌంట్ బిల్లు-2024 (ద్రవ్య వినిమయ తాత్కాలిక బిల్లును పరిగణనలోకి తీసుకోవడం)లకు శుక్రవారం శాసనసభ ఆమోదం తెలిపింది. ఇందులో ఎపి ఎలక్ట్రిసిటీ డ్యూటీ సెకెండ్ అమెండ్‌మెంట్ బిల్లు-2024ను విద్యుతుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, న్యాయాధికారుల పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ బిల్లు, ఎపి అప్రాసియేషన్ ఓటాన్ అకౌంట్ బిల్లు-2024ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు.

ఆ 2 'వర్సిటీ'ల్లో ప్రవేశాలు కల్పించాలి

- పిడిఎఫ్ వాయిదా తీర్మానం తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీల గురించి చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర సభ్యులు పాకలపాటి రఘువర్మ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్ కె మోషేను రాజు తిరస్కరించారు. శాసనమండలి ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని శుక్రవారం మండలిలో వాయిదా తీర్మానం అందించారు. ఈ అంశంపై చర్చించాలని వారి స్థానాల వద్ద నిల్చొని సభ్యులు పట్టుబట్టారు. ఈ రెండు యూనివర్సిటీలు విభజన హామీల్లో పదో షెడ్యూల్‌లో ఉన్నాయన్నారు. పదేళ్లు పూర్తవ్వడంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రాష్ట్ర విద్యార్థులకు ఈ ఏడాది అడ్మిషన్లు నిలిపేశారని చెప్పారు. ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఈ రెండు యూనివర్సిటీల్లో రాష్ట్ర వాటాను తీసుకుని రాష్ట్రంలో తాత్కాలికంగా అనంతరం శాశ్వతంగానూ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్ర విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చెప్పిన ఛైర్మన్ వేరే పద్ధతిలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని తెలిపారు.

మెడికల్ కాలేజీల పిపిపికి వ్యతిరేకం

రాష్ట్రంలో నిర్మాణంలో వున్న మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలోకి తీసుకురావడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీలన్నిటినీ ప్రభుత్వమే నిర్వహించి 100 శాతం సీట్లు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

నిత్యావసర ధరలపై వైసిపి

నిత్యావసర ధరల గురించి చర్చించాలని వైసిపి సభ్యులు వరుదు కళ్యాణి, ఎస్ మంగమ్మ, టి కల్పలతా రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. ఈ అంశంపై చర్చించాలని వైసిపి సభ్యులందరూ వారి స్థానాల్లో నిల్చొని పట్టుబట్టారు. వేరే పద్ధతిలో చర్చకు రావాలని ఛైర్మన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు.



కార్మిక, రైతు సంఘాల సమావేశంలో వడ్డే తదితరులు

26న రైతు, కార్మిక ప్రదర్శనలు జయప్రదం చేయండి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నవంబరు 26వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ప్రదర్శనలు, ధర్నాలు, సభలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరిగింది. అనంతరం సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ ఈనెల 26వ తేది కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అనవసరంగా దిగుమతి చేసుకుంటున్న పంటల వల్ల గిట్టుబాటుధర లేక రెండేళ్ల కాలంలో ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు రైతాంగం నష్టపోయిందని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి కేంద్రప్రభుత్వం దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి రాబోయే మూడు సంవత్సరాల కాలంలో 11 కోట్లమంది రైతులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ఒప్పందం చేసుకున్నారని, ఇది సిగ్గుచేటని తెలిపారు. దీనివల్ల భారత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని చెప్పారు. సహకార రంగాన్ని కేంద్రం స్వాధీనం చేసుకుని స్వతంత్రంగా ఉన్న పాడి, మత్స్య ప్రాథమిక పరపతి సంఘాలను కలిపేసి కార్పొరేట్ శక్తులకు ధారధత్తం చేయడానికి చట్టం చేసిందని దీనివల్ల దేశంలో సహకార వ్యవస్థ కుప్పకూలిపోతుందని తెలిపారు. రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. నవంబరు 26వ తేదీన దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, నిరసనలు, ధర్నాలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించిన కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలని, ప్రభుత్వం రంగ సంస్థలను కాపాడాలని కార్మికులు చేస్తున్న పోరాటానికి రైతులు, ఇతర ప్రజా సంఘాలు అండగా నిలవాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసిన కేంద్రం తీరుకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ పేదల పాలిట ఉరితాడుగా ఉన్న ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలని కోరారు. ప్రీపెయిడ్ మీటర్లు పెట్టడాన్ని ఆపేయాలని డిమాండు చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ అటవీ హక్కుల సవరణ చట్టం 2023ను ఉపసంహరించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌నూ నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పొలారి, కౌలు రైతు నాయకులు జమలయ్య మాట్లాడుతూ కార్మికులు, రైతులు, శ్రామిక ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, నాయకులు ఆర్.వి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జివి రెడ్డి

రెండేళ్లలో 50 లక్షల కనెక్షన్లు

- ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎపి ఫైబర్‌నెట్ లిమిటెడ్ కనెక్షన్లను రెండేళ్ల కాలంలో 50 లక్షలకు పెంచుతామని ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ మూడో అంతస్తులోని ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ లిమిటెడ్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 6 లక్షల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయని, వీలైనంత వరకు క్వాలిటీ సర్వీస్‌లు ఇచ్చి ప్రజల ఆదరణ పొందుతామన్నారు. ప్రైవేట్ కంపెనీ సర్వీస్ ప్రొవైడర్లకు పోటీగా ప్రజలకు సర్వీస్‌లు అందిస్తామని జివిరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు ఎపి ఎస్‌ఎఫ్‌ఎల్‌ను చేరువ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై అధ్యయనం చేసిన తర్వాత స్పందిస్తానన్నారు. తనకు ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జివిరెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గాలి భానుప్రకాష్, బిఎన్ విజయ్‌కుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కందుల నారాయణరెడ్డి, కొండ్రు మురళీమోహన్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

యురేనియం బోర్ల తవ్వకాల చర్యలు నిలిపివేయాలి

- అటవీ శాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో యురేనియం లభ్యత, పరిశోధన కోసం బోర్ల తవ్వకాల ప్రతిపాదనలకు సంబంధించి అన్ని చర్యలనూ నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ పి.రంజిత్ బాష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఈ నెల 14న ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. యురేనియం బోర్ల తవ్వకాల ప్రతిపాదనలకు సంబంధించి ఇకపై ఏ విధమైన చర్యలూ తీసుకోవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. యురేనియం తవ్వకాలు జరిగితే భారీ నష్టం జరిగే అవకాశం ఉందని ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

వివేకా హంతకులకు శిక్షపడేలా సహకరించండి

- కడప జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పిని కలిసిన సునీత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

వివేకా హంతకులకు శిక్షపడేలా సహకరించాలని కడప జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్ నాయుడును వైఎస్ సునీత కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వివేకా హత్య కేసు గురించి ఇన్‌ఛార్జి ఎస్‌పికి వివరించారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి తనపై పెట్టిన అభ్యంతరకర పోస్టులపైనా ఆమె చర్చించారు. అనంతరం కడప నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మర్యాదపూర్వకంగానే సునీత తనను కలిశారని ఎస్‌పి తెలిపారు. గతంలో ఎస్‌పిగా ఉన్న హర్షవర్ధన్‌రాజును కూడా ఆగస్టులో సునీత కలిశారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహారాష్ట్రలో ఈ నెల 16, 17 తేదీల్లో ఎన్‌డిఎ తరపున ఎన్నికల ప్రచారానికి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 16న నాంథేడ్ జిల్లా డెగ్లూర్, భోకర్ నియోజకవర్గం బహిరంగ సభల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు లాతూరులో, సాయంత్రం 6 గంటలకు షోలాపూర్‌లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. 17న విదర్భ ప్రాంతంలో పర్యటిస్తారు. అనంతరం చంద్రపూర్ జిల్లా బల్లార్‌పూర్‌లో బహిరంగ సభ, సాయంత్రం పుణే కంటోన్మెంట్ పరిధిలో రోడ్‌షోలో, కస్బాపేట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

విద్యుత్ రంగంపై తీవ్ర దాడి

- శ్వేతపత్రం విమర్శలకే పరిమితం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



సదస్సులో మాట్లాడుతున్న నర్సింగరావు

ప్రజాశక్తి-గుంటూరు

బడా పెట్టుబడిదారులకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్పటమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర స్థాయిలో దాడి చేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. విద్యుత్ సంస్కరణలను ఉద్యోగులు, వర్కర్లు, ప్రజల భాగస్వామ్యంతో ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 'విద్యుత్ రంగం-ప్రభుత్వ విధానాలు-సవాళ్లు' అనే అంశంపై గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసి ఎంప్లాయిస్ యూనియన్ (యుఇఇయు), యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యుఇసిడబ్ల్యుయు) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. యుఇఇయు, యుఇసిడబ్ల్యుయు రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, జె.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో నర్సింగరావు మాట్లాడుతూ.. విద్యుత్ రంగం నిత్యావసరంగా మారిందని తెలిపారు. విద్యుత్ రంగం ఆస్తుల విలువ రూ.82 లక్షల కోట్లని, దీనిని అంబానీ, అదానీ వంటి పెట్టుబడిదారులకు అప్పగించటానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, రూ.32 వేల కోట్ల భారం మోపారని శ్వేత పత్రంలో పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక భారాలు తగ్గించారా? అని ప్రశ్నించారు. నాలుగు నెలల్లోనే రూ.6 వేల కోట్లకుపైగా ట్రూ అప్ ఛార్జీలు పెంచారని, మరో రూ.11 వేల కోట్లు పెంచటానికి సిద్ధమయ్యారని తెలిపారు. ప్రభుత్వం రూ.2లకే యూనిట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నా ప్రయివేటు కంపెనీల నుండి రూ.8లకు కొనుగోలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో షిర్డీ సాయి కంపెనీతో జరిగిన ఒప్పందాల్లో అవినీతి జరిగిందని, అదే కంపెనీని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు రెండూ ప్రజలపై భారాల విషయంలో ఒకటేనని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం పరిశ్రమలకు తక్కువ ధరకు విద్యుత్‌ను ఇవ్వలేకపోతోందని, భారాలు భరించలేక పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలిపారు. రూ.6.8 వేల కోట్లతో అదానీ కంపెనీతో ఒప్పందం చేసుకొని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, స్మార్ట్ దోపిడీకి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఖర్చును కూడా ప్రజల నుండే వసూలు చేస్తారని, మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ రంగాన్ని పరిరక్షించుకోవటానికి ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సదస్సులో యుఇసిడబ్ల్యుయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజఫర్ అహ్మద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యుఇఇయు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగబ్రహ్మాచారి, సిఐటియు గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధాన కార్యదర్శులు వై.నేతాజి, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

సైన్సుపై ఆసక్తిని పెంపొందించాలి

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మానవుని సహజ లక్షణమైన ఉత్సుకతను పెంపొందించడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం గేయానంద్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన రాష్ట్ర కమిటీ సభ్యులు జిలానీ బాషా అధ్యక్షతన జెవివి సైన్స్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. సైన్స్ క్లబ్‌ను గేయానంద్ ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ క్లబ్ అనేది పిల్లలు స్కూల్స్‌లోనూ, కాలేజీలోనూ చదివే సైన్స్‌తో పాటు వారిలో సైన్స్ స్ఫూర్తిని నింపుతుందని అన్నారు. భారతదేశంలో సైన్స్ ఆవశ్యకతను విజువలైజేషన్ చేసిన వ్యక్తి జవహర్ లాల్ నెహ్రూ అని, ఆయనే స్వతంత్ర భారతంలో అనేక విశ్వవిద్యాలయాలను, పరిశోధన సంస్థలను ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో కీలకోపన్యాసం చేసిన 'చెకుముకి-విద్యార్థి సైన్స్ మాసపత్రిక' సంపాదకవర్గ సభ్యులు యుగంధర్ మాట్లాడుతూ.. సైన్స్ అంటే ఆలోచించడమని, సమాజానికి పనికి వచ్చే విధంగా సైన్స్ ఆవిష్కరణలను బ్రూనో, గెలీలియో వంటి శాస్త్రవేత్తలు ప్రాణత్యాగాలు చేసి నిరూపించారని, వాటిని అన్వయించుకుని మన జీవితాలను ఆనందంగా గడుపుతున్నామని అన్నారు. ఆనాటి వారి త్యాగఫలాలను ప్రజలందరికీ చేరేలా కృషి చేయాలన్నారు. ప్రతియేటా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జెవివి నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల వల్ల పిల్లల్లో సృజనాత్మక పెరుగుతుందని అన్నారు. పరిశోధనలు చేయాలనే ఆసక్తిని ఈ సైన్స్ క్లబ్ గ్రూప్ ద్వారా పెంపొందించుకోవచ్చని అన్నారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు మహేష్ మాట్లాడుతూ.. జెవివి సైన్స్ క్లబ్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రూపులో జాయిన్ అవ్వడం కోసం ఫోన్ నెంబరు 9398524988ని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. జెవివి రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల నాయకులతోపాటు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు, సైన్స్ అభిమానులు పాల్గొన్నారు.

గురుకులంలో రుయా చిన్నపిల్లల వైద్యబృందం

- 90కి చేరిన జ్వరపీడితుల సంఖ్య

ప్రజాశక్తి - సత్యవేడు (ప్రజాశక్తి)

తిరుపతి జిల్లా సత్యవేడులోని బిసి బాలుర గురుకుల పాఠశాలలో వైరల్ జ్వరాలు విజృంభించాయి. రెండు రోజులుగా విద్యార్థులు జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం కూడా కొత్త కేసులు నమోదు కావడంతో తిరుపతి నుంచి రుయా ఆస్పత్రికి చెందిన చిన్నపిల్లల వైద్యనిపుణులు సత్యవేడుకు విచ్చేసి వైద్యసేవలు అందించారు. పాఠశాలలో మొత్తం 418 మంది విద్యార్థులు చదువుతుండగా, దాదాపు 90 మంది విద్యార్థులు జ్వరాల బారినపడ్డారు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురైన శివకుమార్‌ను రుయాకు తరలించారు. శుక్రవారం మరో విద్యార్థి కె.మహేష్‌ను రుయాకు పంపించారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారులు చిన్నపిల్లల వైద్యనిపుణులైన డాక్టర్ ప్రసాద్‌రెడ్డి బృందాన్ని సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపించి వైద్యసేవలు అందించారు. అనంతరం గురుకుల పాఠశాలకు చేరుకుని పాఠశాలలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులో విద్యార్థులను పరిశీలించారు. స్వల్పంగా బాధపడుతున్న వారికి అక్కడికక్కడే వైద్యం అందించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం క్యాంపు నుంచి స్థానిక సిహెచ్‌సికి తరలించారు.

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలేదేనని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ల్యాండ్ మాఫియా కబంధహస్తాల్లో కొల్లేరు చిక్కుకుపోయి కొట్టుమిట్టాడుతోందని తెలిపారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని కొల్లేరులో ఆయన శుక్రవారం బోటులో ప్రయాణించారు. పెరిగిన కాలుష్యాన్ని, బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కలిసే ప్రాంతాన్ని పరిశీలించారు. లంకల గ్రామాల ప్రజలతో మమేకమై వారు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా వందల ఎకరాల్లో చేపల చెరువులు తవ్వేసి సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేసేశారన్నారు. కొల్లేరు సమస్యను పరిష్కరించకుంటే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి దీక్ష చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మార్క్సిజానికి ప్రాణం పోసిన గణపతి

- కావలి ప్రాంతంలో ఉద్యమకారులను తయారు చేశారు
- సంతాప సభలో వి శ్రీనివాసరావు



చిమట గణపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి- కావలి

నెల్లూరు జిల్లా కావలి ప్రాంతంలో మార్క్సిజానికి చిమట గణపతి ప్రాణం పోశారని, ఎందరో ఉద్యమకారులను తయారు చేసిన గొప్ప చరిత్ర ఆయనదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల ఒకటిన కన్నుమూసిన కమ్యూనిస్టు ఉద్యమ నేత చమట గణపతి సంతాప సభ సిపిఎం, ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన కావలిలో శుక్రవారం జరిగింది. ఈ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కావలి ప్రాంత పార్టీ ఉద్యమంలో గణపతికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తనతోపాటు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు వంటి ఎందరో నాయకులను రాష్ట్రానికి, దేశానికి అందించారని వివరించారు. సామాన్య ప్రజల్లోకి పార్టీని ఎలా తీసుకెళ్లాలో చేసి చూపించారన్నారు. రైతు పోరాటాలు, జమీందారీ వ్యతిరేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. కావలి ప్రాంతంలో ఎస్‌ఎఫ్‌ఐని బలమైన శక్తిగా తయారు చేయడంలో గణపతి కృషి నేటి తరం నాయకులకు ఆదర్శమన్నారు. విద్యార్థులు, రైతులు, యువకులు, సాధారణ ప్రజలతో మమేకమై ఎన్నో సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారని, చివరి వరకూ కమ్యూనిస్టుగా జీవించారని తెలిపారు. గణపతి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నివాళని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి జర్నలిజం కళాశాల మాజీ ప్రిన్సిపల్ వున్నం వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ జలదంకి, లింగరాజు అగ్రహారం, పాత బిట్రగుంట గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహించారని వివరించారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కావలి ప్రాంతంలో సిపిఎం అభివృద్ధికి కృషి చేశారన్నారు. విరసం నాయకులు చెంచయ్య మాట్లాడుతూ గణపతి తన స్వగ్రామం సాయిపేటలో 1957లో రైతు మహాసభను జయప్రదంగా నిర్వహించారని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ గణపతి 1956లో రాళ్లపాడు ప్రాజెక్టు నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని, కూలీలకు అప్పట్లో రోజు కూలి 12 పైసలు ఇస్తుంటే పోరాడి 25 పైసలు సాధించారని తెలిపారు.

ప్రభుత్వ రంగంతోనే అభివృద్ధి సాధ్యం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంతోనే దేశాభివృద్ధి సాధ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1373వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, ఉక్కు ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దాని నిర్వీర్యానికి కుట్రలు పన్నుతోందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే దేశంలోని అన్ని రంగాలూ ముందుకు వెళ్తాయన్న విషయాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు గుర్తించాలన్నారు. సమానత్వం, ఉద్యోగ భద్రత వంటి అంశాలను ప్రభుత్వ రంగం మాత్రమే పాటిస్తోందని, ప్రయివేట్ రంగంలో ఉద్యోగ భద్రత ఉండదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, ఆర్థిక వనరులు సమకూర్చి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

శ్రీవారికి 15 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల బహూకరణ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారికి 15 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన పెరల్ మినిరల్స్ అండ్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి సి.వెంకటనాగరాజ ఈ వాహనాలను అందజేశారు. టిటిడి అడిషనల్ ఇఒ వెంకయ్య చౌదరికి వాహనాల తాళాలను దాత అందజేశారు. ఈ వాహనాల ధర దాదాపు రూ.22 లక్షలు ఉంటుందని వెంకటనాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ సురేంద్ర, తిరుమల డిఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోవడం తగునా..?

- సిఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు(కాకినాడ జిల్లా)



హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం తగునా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన శుక్రవారం ఒక లేఖ రాశారు. అధికార దాహం తీర్చుకోవడం కోసం సూపర్-6 అంటూ హామీల తుపాను సృష్టించి అధికారంలోకి వచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేయడం మీ లాంటి సీనియర్ నాయకులకు తగునా అని ప్రశ్నించారు. సూపర్-6ను అమలు చేయాలంటే కోట్లాది రూపాయలు కావాలనే సంగతి మీకు తెలియాదా? తెలిసి అబద్ధాలు చెప్పి ఎందుకు ఓట్లు వేయించుకున్నారని ప్రశ్నించారు. హామీలు ప్రజలకు గుర్తు రాకుండా ఉండేందుకు తిరుపతి ప్రసాదంపైనా, రెడ్ బుక్‌తోనూ, తప్పుడు పోస్టింగులపైనా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిధులు లేవనే సాకుతో పిపిపి పేరుతో రోడ్లు వేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజలు లక్షలాది రూపాయల ఎంవి ట్యాక్స్ రూపంలో కడుతున్నారని, ఇవి కాక పిపిపి పద్ధతిలో టోల్ ట్యాక్స్ కట్టించుకోవడం న్యాయమా? అని ప్రశ్నించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తుంటే అడ్డుకోకపోవడం, ప్రత్యేక హోదా కోసం ప్రయత్నం చేయకపోవడం అన్యాయమని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టుల పేరుతో అమాయకులను జైలులో పెట్టి కొట్టించడం మంచిది కాదని లేఖలో పేర్కొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి తదితరులు

వరదల్లో మునిగిన మోటార్లు, ఆయిల్ ఇంజిన్లకు నష్టపరిహారం

- మంత్రి అచ్చెన్నాయుడుకు కౌలురైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా నది, బుడమేరు వరదల సందర్భంగా మునిగి, పాడైపోయిన మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని మంత్రిని ఎపి కౌలు రైతు సంఘం కోరింది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. వరదల్లో ఆయిల్ ఇంజిన్లు, మోటార్లు పూర్తిగా పాడైపోయినా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని తెలిపారు. రిపేర్ల కోసం రూ.10 వేల వరకూ ఖర్చవుతుందని, విజయవాడలో మోటార్లకు పరిహారం ఇచ్చినట్లు, రైతుల మోటార్లకు పరిహారం ఇవ్వాలని కోరారు. లంకల్లో ఇసుక మేట వేసిన భూముల్లో ఇసుకను తొలగించి పంట వేసుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చవుతుందని, ప్రభుత్వమే ఇసుక మేటలను తొలగించాలని కోరారు. వరికి రూ.25 వేలు, కంద, పసుపు వంటి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.60 వేల నుండి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వరదలకు గురైన ఇళ్లకు విజయవాడలో ఇచ్చినట్లు రూ.25 వేలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ కింద హామీ ఇచ్చినట్లుగా రైతులకు రూ.20 వేలు రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలని కోరారు. కౌలురైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూలు చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని, పంటల బీమా వాస్తవ కౌలు రైతులందరికీ ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ పంట వేసుకోవడానికి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని, ఇ-క్రాప్ నమోదు చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడమే లక్ష్యం

- 8 విభాగాల్లో ఐఐటి మద్రాస్‌తో ప్రభుత్వం ఒప్పందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ రంగాల్లో అధునాతన సాంకేతిక, పరిశోధనల ఫలాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మద్రాస్ ఐఐటి (రీసెర్చి ఇన్‌స్టిట్యూట్)తో ప్రభుత్వం 8 విభాగాల్లో ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటి మద్రాస్ ప్రతినిధులతో శుక్రవారం ఉదయం సిఎం చంద్రబాబు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ఈ సందర్భంగా ఐటి మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఐఐటి మద్రాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, బిసి జనార్ధన్‌రెడ్డి, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఉన్నతాధికారులు కృతికాశుక్లా, విజయరామరాజు, యువరాజ్, కన్నబాబు, ఐఐటి మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసరు విజినాథన్ కామకోటి, డీన్ ఆఫ్ ప్లానింగ్ రామానుజం సారధి, ఎంజె శంకర్‌రామన్ (సిఇఒ ఐఐటి మద్రాస్ ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్) పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని మద్రాసు ఐఐటి ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మద్రాసు ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసరు విజినాథన్ కామకోటి మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగంలో ఆర్‌టిజిఎస్ లాంటి సాంకేతిక వ్యవస్థ ఉండటం అద్భుతమని, ఆర్‌టిజిఎస్ పనితీరు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆర్‌టిజిఎస్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షిస్తోందని మద్రాస్ ఐఐటి ప్రతినిధుల బృందానికి అధికారులు వివరించారు.

సంపాదకీయం

ధరలు పైపైకి...

రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 6.21 శాతం పెరిగి 14 నెలల గరిష్టానికి చేరుకుందన్న వార్త సామాన్యుల గుండె గుభేలుమనిపిస్తోంది. సెప్టెంబర్‌లో 5.49గా ఉన్నదల్లా నెల రోజుల్లో మరింత పెరగడం ఆందోళనకరం. సోమవారంనాడు కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ వెల్లడించిన వివరాలు, ఈ రెండు వారాలుగా 'బేర్'మంటున్న స్టాక్ మార్కెట్లు, దిగజారుతున్న రూపాయి విలువ వంటి అంశాలు భారత ఆర్థిక వ్యవస్థ ఎంతటి గందరగోళ పరిస్థితికి చేరువవుతుందో తేటతెల్లం చేస్తున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల తీవ్రమైన అంశంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారమే కూరగాయల ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 36 శాతం కాగా అక్టోబర్‌లో 42 శాతానికి ఎగబాకింది. వంట నూనెల ధరలు గడచిన రెండేళ్లలో ఎన్నడూ లేనంతగా 9.5 శాతం పెరిగాయి. గత రెండు నెలల్లోనే పామాయిల్ లీటర్ రూ.40, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.45 పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం సుంకాన్ని పెంచి ఆజ్యం పోసింది. ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికీ ప్రభుత్వ విధానానికీ వున్న లంకెను వివరించడానికి ఇంతకన్నా ఏం కావాలి? మొత్తంగా ఆహార ద్రవ్యోల్బణం ఇలాగే కొనసాగుతూపోతే సామాన్యులను ఆహార భద్రతకు దూరం చేస్తుంది. పిల్లలు, బాలింతల్లో పౌష్టికాహార లోపం మరింతగా విజృంభిస్తుంది. కాబట్టి భవిష్యత్తరాలను కూడా ప్రభావితం చేసే ప్రమాదం ముంచుకొస్తోంది. తస్మాత్ జాగ్రత్త!

దలాల్ స్ట్రీట్‌పై మరోమారు బేర్ పంజా విసిరింది. మదుపర్లు ఒక్క పూటలోనే రూ.5 లక్షల కోట్లకు పైగా నష్టపోయిన దుస్థితి. ఇదేదో ఒక్క రోజుకో ఒక్క వారానికో పరిమితమైన పరిస్థితి కాదు. గడచిన రెండు వారాల్లో దాదాపు ప్రతి సెషన్‌లోనూ స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురవుతున్నాయి. గడిచిన ఏడు సెషన్లలో ఏకంగా రూ.25 లక్షల కోట్లకుపైగా మదుపర్ల సంపద ఆవిరయ్యింది. ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో మదుపర్లు ముందస్తు అప్రమత్తతతో అమ్మకాలను వేగవంతం చేస్తున్నారు. గత సోమవారం ఒక్క సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.2,306 కోట్ల విలువ చేసే పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారంటే ధోరణి ఎలావుందో విదితమవుతోంది. గత అక్టోబర్ నెలలో ఏకంగా రూ.1.14 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోగా... ఈ నవంబర్ నెలలో ఇప్పటి వరకు రూ.25 వేల కోట్లు పైగా తరలించుకుపోయారు. ఈ పరిణామం భారత మార్కెట్లు వరుసగా పతనం కావడానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలోనే రిజర్వ్ బ్యాంకు నిల్వల నుండి 2,600 కోట్ల డాలర్లు (సుమారు రూ. 2 లక్షల 20 వేల కోట్ల విలువ) విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించింది. ఇలా కరగదీస్తుండడంతో భారత విదేశీమారక ద్రవ్య నిల్వలు నెలనెలా తరిగిపోతున్నాయి. ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటున్నప్పటికీ అంతర్జాతీయ విపణిలో రూపాయి విలువ పతనమవుతూనే ఉంది. దానికి ఫుల్‌స్టాప్ పడడంలేదు. ఇదే సమయంలో భారత ఎగుమతులు స్వల్పంగా పెరిగినప్పటికీ దిగుమతులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి. ఆ దెబ్బతో అటు వాణిజ్య లోటు పెరగడం, మరోవైపున విదేశీమారక ద్రవ్య నిల్వలు తరగడం ఆర్థిక వ్యవస్థను మరింతగా ఒత్తిడికి గురి చేస్తున్న పరిణామాలు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల అనంతరం ఆర్‌బిఐ జోక్యం ఎలా వుంటుందో, ద్రవ్య సమీక్షలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు. అంతర్జాతీయ విపణిలో పరిణామాల ప్రభావమూ పరిగణన లోకి తీసుకోవాలి.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలవల్లనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నది నిర్వివాదాంశం. ఇప్పటికైనా సర్కారు తెలివి తెచ్చుకొని ఈ దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి, దేశీయ మార్కెట్ల వృద్ధికీ అవసరమైన విధానాలను అనుసరించాలి. దిగుమతుల పైన, విదేశీ మదుపరులపైన అతిగా ఆధారపడే విధానాలు విడనాడాలి. అయితే, కార్పొరేట్ మతతత్వ కూటమి ప్రభుత్వం తనంతట తానుగా అలాంటి విధానపరమైన మార్పునకు పూనుకోదు. అందుకోసం విశాల ఐక్య ప్రజా ఉద్యమాలు పెరగాల్సిందే!

మహనీయుల మాట



సహాయం చేస్తే మర్చిపో. సహాయం పొందితే గుర్తుంచుకో.

- గాంధీజీ

ఉన్నత న్యాయ వ్యవస్థ - హిందుత్వ

వ్యాఖ్య

భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డి.వై.చంద్రచూడ్ పదవీ విరమణ సందర్భంగా అనేక విమర్శనాత్మక అంచనాలు, వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇటీవలి కాలంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా పని చేసిన వారిలో అత్యంత ప్రభావశీలమైన వారిలో జస్టిస్ చంద్రచూడ్ ఒకరుగా పరిగణించబడ్డారు గనక ఇది సహజమే. పైగా గత రెండు దశాబ్దాలలో మరే సిజెఐ చేయని విధంగా ఆయన రెండు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించారు. రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడే బాధ్యత గల న్యాయ వ్యవస్థ అధిపతిగా ఆయన నిర్వహించిన పాత్రను సరిగ్గా అంచనా వేయాలంటే తను చేసిన మొత్తం కృషిని పరిశీలించవలసి వుంటుంది. ఈ పనిచేసే సందర్భంలో సిజెఐ చంద్రచూడ్ ఏ నేపథ్యంలో తన న్యాయ పాలనా బాధ్యతలు నిర్వహించారో కూడా గమనంలో పెట్టుకోవడం అవసరం.

రెండవ దఫా అధికారం లోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన హిందూత్వ ఎజెండాను ముందుకు నెట్టేందుకై దూకుడుగా ప్రయత్నిస్తున్న కాలం. రాజ్యాంగాన్ని పౌరుల ప్రాథమిక హక్కులను వమ్ము చేసే ఎజెండా అది. ఈ సందర్భంలోనే జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాంగ సమస్యలపైన, మెజార్టీ మతతత్వ దాడిపైన ఇచ్చిన తీర్పులను చూడవలసి వుంటుంది.



> వీటన్నిటినీ బట్టి వెల్లడయ్యేది ఒకటే. కేవలం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక్కరే గాక మొత్తం ఉన్నత న్యాయ వ్యవస్థలో మత భావనలు పెరుగుతున్నాయనే వాస్తవం. మోడీ దశాబ్ది పాలన ప్రభావంతో ఇటీవలి కాలంలో బహిరంగంగానే హిందూత్వ భావనలు ఉన్నత న్యాయ వ్యవస్థ దొంతరలో, న్యాయ వర్గాల్లో విస్తరించాయి. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఒకరు తన పదవీ విరమణ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో తన యావజ్జీవిత బంధాన్ని, ఆ సంస్థకు తన రుణపడి వుండటాన్ని గురించి ప్రకటించారు. మరో హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ ఎన్నికలకు కొన్ని వారాల ముందు రాజీనామా చేసి కొద్ది రోజుల్లోనే బిజెపి అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసి గెలుపొందారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

రెండు తీర్పులు

ఈ కోణంలో రెండు తీర్పులు ఒకటి ఆయన న్యాయమూర్తిగా వుండగా ఇచ్చింది, మరోటి సిజెఐగా ఇచ్చింది కీలక పరీక్షకు వస్తాయి. అయోధ్య వివాదంపై తీర్పునిచ్చిన అయిదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ చంద్రచూడ్ ఒక సభ్యుడు. ఆయన రచించిన తీర్పు బాబ్రీ మసీదు వుండిన వివాద స్థలం మొత్తాన్ని రామమందిర నిర్మాణానికై హిందువులకు అప్పగించింది. సాక్ష్యాలు, క్షేత్ర స్థాయి వాస్తవాల కన్నా ఎక్కువగా మతభావనలు, విశ్వాసాలపై ఆధారపడి ఆ తీర్పు రూపొందింది. బాబ్రీ మసీదు విధ్వంసం రాజ్యాంగ విరుద్ధమైన దిగ్భ్రాంతికర చర్య అని ఒప్పుకుంటూనే ఆ తీర్పు అలా రూపొందింది. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి-విశ్వహిందూ పరిషత్‌ల వాదనను చట్టబద్ధం చేస్తూ ఆ విధంగా బిజెపి మూల ఎజెండాలో ఒకదాన్ని నెరవేర్చిన న్యాయవ్యవస్థ తీర్పు అది. తర్వాతి కాలంలో సిజెఐ చంద్రచూడ్ వారణాసిలోని గ్యాన్‌వాపి మసీదు కేసును కూడా తిరగదోడడానికి అనుమతించడాన్నిబట్టి ఈ తీర్పు ఏదో ఒకసారి వ్యవహారం కాదని తేలిపోయింది. 1991 ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టం అలాంటి కేసులు పున:ప్రారంభించడాన్ని నిషేధిస్తున్నప్పటికీ హిందువులు గ్యాన్‌వాపి మసీదు స్వభావాన్ని మార్చాలని కోరడం లేదనీ కేవలం దాని మత మూలాలను తెలుసుకోవాలని మాత్రమే కోరుతున్నారని ఒక సందేహాస్పద వాదనతో సిజెఐ చంద్రచూడ్ ఈ కేసులను అనుమతినిచ్చారు. దానివల్ల హిందూత్వ శక్తులు వారణాసి, మధుర వివాదాలను మళ్లీ రగిలించేందుకు లైసెన్సు లభించినట్టయింది.

సిజెఐ చంద్రచూడ్ ఇచ్చిన మరో ప్రధానమైన తీర్పు జమ్ము కాశ్మీర్ 370 అధికరణాన్ని రద్దు చేయడం, ఆ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడం సంబంధించి. జమ్ము కాశ్మీర్ రాజ్యాంగ పరిషత్తు ఇంకేమాత్రం ఉనికిలో లేదు గనక కార్యనిర్వాహక వర్గం 370 అధికరణాన్ని ఏకపక్షంగా సవరించే అధికారం కలిగివుంటుందని ఆ తీర్పు ఆమోదం తెల్పింది. రాజ్యాంగం మూడవ అధికరణంలోని ప్రక్రియను ఉల్లంఘించి జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించివేయడంపై తీర్పు నిస్తూ భవిష్యత్తులో ఒకనాటికి మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామనే హామీని ఆమోదిస్తున్నట్టు చెప్పింది. 370వ అధికరణాన్ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ చర్యను ఏదో విధంగా ఆమోదించాలని మాత్రమే ఆ తీర్పు ఉద్దేశమని తప్ప మరో విధంగా అర్థం చేసుకోవడం కుదరదు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మూల ఎజెండాలో మరోటని గుర్తించడం ఇక్కడ చాలా ముఖ్యం.

కొలీజియం, ధర్మాసనాల తీరు

సిజెఐ చంద్రచూడ్ హయాంలో ధర్మాసనాలకు జడ్జిల నియామకం చేసే బాధ్యత (మాస్టర్ ఆఫ్ ద రోస్టర్) నిర్వహణలోనూ, కొలీజియం వ్యవస్థ పని తీరులోనూ ఇంకా ఇతర అంశాలున్నాయి. ఈ విషయంలోనూ ఒక స్పష్టమైన పద్ధతి పాటించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. పౌరుల వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన కేసులు అంటే దీర్ఘకాలం నిర్బంధం సాగిన భీమా కోరెగావ్, ఈశాన్య ఢిల్లీ మత ఘర్షణల కేసుల వంటివి ఒక పథకం ప్రకారం నిర్దిష్ట ధర్మాసనానికే పంపినట్టు కనిపిస్తుంది. ఆ పౌర హక్కులు బెయిల్ మంజూరు వంటి విషయాల్లో మితవాద దృక్పథంతో గల న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికే వాటిని పంపించారు. ఇక కొలీజియం పని విషయానికి వస్తే హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల నియామకం నియంత్రణ ప్రభుత్వానికే వదలివేయడం ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది.

అయితే ఇవన్నీగాక మరో విషయం కూడా కొట్టొచ్చినట్టు కనిపించింది. ఈ జ్ఞానవంతుడైన జడ్జి వ్యక్తిగత స్వేచ్ఛలను రాజ్యాంగ సూత్రాలను దృఢంగా సమర్థిస్తారనే భావన వుండగా ఆయన చివరకు రాజ్యాంగం, దాని విలువల పట్ల విధేయత కన్నా తన వ్యక్తిగత నమ్మకాన్నే అధికంగా చూడటమే. తన పదవీ విరమణకు ముందు ఆఖరి ఘట్టంలో చంద్రచూడ్ అయోధ్య కేసు పరిష్కారం కోసం తాను దైవాన్ని ప్రార్థించానని చెప్పడం అనేక మందిని దిగ్భ్రాంతికి గురి చేసింది. రాజ్యాంగ చట్టం ప్రకారం గాక దైవ ప్రేరణతో ఆ తీర్పు రాశానని ఒప్పుకున్న దాన్ని రాసిన వ్యక్తి చెబుతున్నాడన్న మాట. మరో సందర్భంలో జస్టిస్ చంద్రచూడ్ గుజరాత్‌లోని ద్వారక ఆలయ సందర్శన తర్వాత అక్కడ వున్న లాయర్ల బృందంతో మాట్లాడుతూ ఆ ఆలయ శిఖరంపై వున్న కాషాయ ధ్వజం న్యాయ పతాకగా వెలుగొందుతుందని ప్రవచించారు.

ఆర్‌ఎస్‌ఎస్ భావనల చొరబాటు

వీటన్నిటినీ బట్టి వెల్లడయ్యేది ఒకటే. కేవలం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక్కరే గాక మొత్తం ఉన్నత న్యాయ వ్యవస్థలో మత భావనలు పెరుగుతున్నాయనే వాస్తవం. మోడీ దశాబ్ది పాలన ప్రభావంతో ఇటీవలి కాలంలో బహిరంగంగానే హిందూత్వ భావనలు ఉన్నత న్యాయ వ్యవస్థ దొంతరలో, న్యాయ వర్గాల్లో విస్తరించాయి. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఒకరు తన పదవీ విరమణ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో తన యావజ్జీవిత బంధాన్ని, ఆ సంస్థకు తన రుణపడి వుండటాన్ని గురించి ప్రకటించారు. మరో హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ ఎన్నికలకు కొన్ని వారాల ముందు రాజీనామా చేసి కొద్ది రోజుల్లోనే బిజెపి అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసి గెలుపొందారు. కొంతమంది న్యాయమూర్తుల ప్రాపంచిక దృక్పథం హిందూత్వతో రూపుదిద్దు కుంటున్నదని మధ్యప్రదేశ్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చేసిన వ్యాఖ్యలు వెల్ల డించాయి. రక్షణోద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ లో చేరడంపై పదవీ విరమణ చేసిన ఒక ప్రభుత్వోద్యోగి వేసిన పిటిషన్‌ను ఆ హైకోర్టు పరిష్కరిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ పై నిషేధాన్ని కేంద్రం ఉపసంహరించిన తర్వాత వెలువడిన ఆ ఉత్తర్వులో హైకోర్టు ఆర్‌ఎస్‌ఎస్ వంటి ఒక గౌరవనీయ సంస్థను దేశంలోని నిషిద్ధ సంస్థల జాబితాలో తప్పుగా చేర్చినట్టు పేర్కొంది. "కేంద్ర ప్రభుత్వం చేసిన ఆ తప్పు వల్ల అయిదు దశాబ్దాల పాటు దేశానికి సేవ చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలు అనేక విధాల క్షీణించిపోయాయి..."అని పేర్కొంది. అంటే విజ్ఞానవంతులైన ఈ జడ్జిలు చెప్పే ప్రకారం దేశానికి సేవ చేయాలంటే ఆర్‌ఎస్‌ఎస్ లో చేరాలన్నమాట.

కారవాన్ పత్రిక 2024 అక్టోబర్ సంచికలో ఆర్‌ఎస్‌ఎస్ లీగల్ విభాగం ఉన్నత న్యాయ వ్యవస్థలో తన పట్టు ఏ విధంగా పెంచు కుంటున్నదీ కళ్లు తెరిపించేలా వ్యాసం ప్రచురించింది. అఖిల భారతీయ అధివక్త పరిషత్ ఆర్‌ఎస్‌ఎస్ న్యాయవాదుల వేదికగా పని చేస్తున్నది. దాని శ్రేణుల నుంచే అంతకంతకూ ఎక్కువగా లీగల్ అధికారులు, అడ్వకేట్ జనరల్స్ వంటి వారు, జడ్జిలు నియమితులవుతున్నారు. 33 మంది ప్రస్తుత న్యాయమూర్తులలో కనీసం తొమ్మిది మంది బహుళ సంఖ్యలో ఆ పరిషత్ కార్య క్రమాలకు ముఖ్య అతిథులుగా హాజర య్యారని కారవాన్‌లో వెలువడిన ఆ వ్యాసం చెబు తున్నది. అత్యున్నత స్థాయిలో వెలువడే న్యాయ నిర్ణయాల్లో మెజారిటీ మతతత్వ మనోభావాలు ప్రతిబింబించు తున్నాయనడానికి సిజెఐ చంద్ర చూడ్ పదవీ కాలపు అనుభవం ఒక ముందస్తు హెచ్చరిక లాంటిది. మొత్తంపైన ఉన్నత న్యాయ వ్యవస్థలో ఆర్‌ఎస్‌ఎస్ చొరబాటుకు మోడీ ప్రభుత్వం ఎలా సహాయ పడిందో చెప్పే హెచ్చరిక ఇది.

(నవంబరు 13 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

'మహా' సంక్లిష్టం

అభిప్రాయం

పార్టీకో ఎజెండా, ప్రాంతానికో సమస్య, కులానికో కోరికతో సంక్లిష్ట రాజకీయాలకు కేరాఫ్‌గా మారిన మహారాష్ట్రలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు ముందంజలో ఉన్నారో అంచనా వేయడం అంత సులభం కాదు. క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న అనేక రకాల ట్రెండ్స్‌ని అధ్యయనం చేస్తున్న పీపుల్స్ పల్స్ పరిశోధనలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొన్నటి లోక్‌సభ ఫలితాలే పునరావృతమవుతాయి అనుకోలేం. గడిచిన నాలుగు నెలల్లో ఇక్కడ అనేక మార్పులు సంభవించాయి. చాలా రాష్ట్రాల్లోలాగే మహారాష్ట్రలో కూడా కులం ఎన్నికలను ప్రభావితం చేస్తుంది. ఎస్సీలు, ఓబీసీలతో పాటు మరాఠాలు, ధంగార్లు పార్టీల భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. ముందు నుంచి దళితులు కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటున్నారు. కాంగ్రెస్‌ని దెబ్బ తీయడానికి ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును బిజెపి సానుకూలంగా మార్చుకుంది. దళితుల్లో చీలిక తెచ్చి చంభర్‌లు, మాతంగ్‌లు, ఖాటిక్‌ల వంటి బౌద్ధేతర ఎస్సీలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది.



జి.మురళీకృష్ణ

తమను ఓబీసీలో చేర్చాలని మరాఠాలు చేస్తున్న డిమాండ్‌తో వారు తమకు దూరం అవుతారనే సందేహాల మధ్య ప్రత్యామ్నాయంగా ఓబీసీలను తమవైపు తిప్పుకోవడానికి బిజెపి వ్యూహాలు రచించింది. వివిధ ఓబీసీ కులాల నుంచి సీనియర్ నాయకులను ప్రోత్సహించడం, ఓబీసీ జాబితాలో కొత్తగా 15 చిన్న కులాలను చేర్చడం ద్వారా ఓబీసీలను గంపగుత్తగా తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి చెందిన ఛగన్ భుజ్‌బల్ వంటి నాయకులను బలపరుస్తోంది. ఓబీసీలలో మాధవ్ మాలి, ధంగర్, వంజరి వంటి ప్రాతినిధ్యం లేని కులాలను కూడా బిజెపి సమీకరించింది. మరట్వాడా, పశ్చిమ మహారాష్ట్ర, విదర్భలో మరాఠాల ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి వంజరి సామాజిక తరగతిని ముందుకు తెస్తోంది.

మహారాష్ట్రలో పలు సామాజిక వర్గాలు రిజర్వేషన్లు కోరుతుండటంతో, ఇతర కులాలు తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని భయపడుతున్నాయి. ఆయా సామాజిక తరగతుల వారిని ఆకర్షించడానికి పార్టీలో ప్రాధాన్యతనివ్వడం, పదవులనివ్వడం ద్వారా అటు ఎంవీయే, ఇటు మహాయుతి ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నాయి.

బిజెపి 1995 నుంచి పట్టణ ఓటర్లను ఆకర్షించడానికి ఒక ప్రణాళిక ప్రకారం అడుగులు వేస్తోంది. బిజెపి చేపట్టిన రోడ్లు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం చేయూతనిచ్చింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాల పట్ల పట్టణ ప్రజల్లో అంచనాలు పెరిగేలా చేయగలిగింది. మరోవైపు, గ్రామీణంలో ఆదరణ ఉందని భావిస్తున్న ఎంవీయే కూటమి ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు స్థానిక సవాళ్లను అధిగమించడంతో పాటు, మహారాష్ట్ర ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంది. విదర్భ, మరాఠ్వాడాలో వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉంది. రైతులు అప్పుల్లో కూరుకుపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి ఒత్తిళ్లతో తీవ్రస్థాయిలో ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వారు పండించే పంటలకు మద్దతు ధర, మెరుగైన మార్కెట్ల సదుపాయాలు వంటి పరిష్కారాలు అందించగలమనే నమ్మకం కలిగిస్తేనే గ్రామీణ ఓటర్ల మద్దతును ఏంవీయే పొందగలుగుతుంది.



> మహారాష్ట్రలో నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఉపాధి కల్పించాలని స్థానిక యువత కోరుతోంది. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడానికి ఎంవీయే దగ్గర ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో వచ్చే నాలుగైదు రోజుల్లోనైనా స్పష్టంగా చెప్తే, నిరుద్యోగుల ఓట్లు పడే అవకాశం ఉంది. అంతేకాక, రాష్ట్రంలో ప్రాంతానికో సమస్య ఉంది. ఈ సమస్యల్ని పరిష్కరించడంలో అధికార మహాయుతి విఫలమైందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, అదే సమయంలో మహా వికాస్ అఘాఢి తమ సమస్యల్ని తీర్చగలదా? అనే సందేహం కూడా ప్రజలను వెంటాడుతోంది.

మహారాష్ట్రలో నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఉపాధి కల్పించాలని స్థానిక యువత కోరుతోంది. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడానికి ఎంవీయే దగ్గర ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో వచ్చే నాలుగైదు రోజుల్లోనైనా స్పష్టంగా చెప్తే, నిరుద్యోగుల ఓట్లు పడే అవకాశం ఉంది. అంతేకాక, రాష్ట్రంలో ప్రాంతానికో సమస్య ఉంది. ఈ సమస్యల్ని పరిష్కరించడంలో అధికార మహాయుతి విఫలమైందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, అదే సమయంలో మహా వికాస్ అఘాఢి తమ సమస్యల్ని తీర్చగలదా? అనే సందేహం కూడా ప్రజలను వెంటాడుతోంది. 36 స్థానాలున్న ముంబైలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకడం గగనమైంది. ధారవి సహా మురికివాడలను శుభ్రం చేయడానికి చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయడంలో అధికారపక్షం విఫలమైంది. ముంబైలో బస్సులు, లోకల్ ట్రైన్స్ సహా ప్రజా రవాణా సమస్యలకు సరైన పరిష్కారం చూపించలేకపోయింది.

మహారాష్ట్రలో 39 స్థానాలు ఉన్న థానే, కొంకణ్ ప్రాంతంలో వధవన్ పోర్ట్, విహార్ అలీబాగ్ మల్టీమోడల్ కారిడార్, బర్సులో పెట్రో కెమికల్ రిఫైనరీ వంటి ప్రాజెక్టుల పట్ల ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు. ఇవి తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని నాశనం చేస్తాయని భావిస్తున్నారు. వీటికి అధికారపక్షం పరిష్కారం చూపలేకపోయింది. మరోవైపు ఏంవీయే నుంచి కూడా దీనిపై స్పష్టమైన భరోసా రావడం లేదు. దీంతో పాటు థానే, కొంకణ్ ప్రాంతంలో నిరుద్యోగం పెరగడం, రాయ్‌గఢ్ నుంచి వలసలు పెరగడం స్థానిక ప్రజలు ఇబ్బందులుగా భావిస్తున్నారు. 58 స్థానాలు ఉన్న పశ్చిమ మహారాష్ట్ర నుంచి పెద్ద ప్రాజెక్టులను గుజరాత్‌కి తరలడంతో నిరుద్యోగం పెరిగిందని యువత అభిప్రాయ పడుతోంది. ఇక్కడ సాగునీటి సమస్యలను కూడా మహాయుతి పరిష్కరించలేకపోయింది. 47 స్థానాలు ఉన్న ఉత్తర మహారాష్ట్రలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధి జరగలేదు. దీంతో గిరిజనులు మహాయుతి పట్ల అసంతృప్తిగా ఉన్నారు. మరోవైపు మద్దతు ధరపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఉత్తర మహారాష్ట్రలో అధికంగా ఉండే ఉల్లి రైతులు ఆగ్రహంగా ఉన్నారు.

విదర్భ ప్రాంతంలో అధికంగా 62 స్థానాలున్నాయి. ఇక్కడ పత్తి, సోయాబీన్ రైతులు తమ పంటకు కనీస మద్దత ధర కావాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల పులుల సంచారం పెరిగి జనావాసాల్లోకి వస్తున్నాయని ఫిర్యాదులు ఇస్తున్నా సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి కేవలం నాగ్‌పూర్‌కే పరిమితం అయ్యిందని, దీంతో ఇతర చిన్న పట్టణాల్లో నిరుద్యోగం పెరిగిందని యువత అసంతృప్తిగా ఉంది.

రాష్ట్రంలో మహాయుతి, ఎమ్‌వీయే కూటముల మధ్య పోటాపోటీ ఉండడంతో రాజ్ థాకరే, ప్రకాష్ అంబేద్కర్, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని చిన్న పార్టీలను, నాయకులను ప్రజలు పక్కన పెట్టారు. దీంతో ఈ ఎన్నికలు రెండు కూటముల మధ్య ద్విముఖ పోటీగా మారాయి. అయితే, ఈ చిన్న పార్టీల నాయకుల్లో ఎవరైనా అనూహ్య ఫలితాలు సాధిస్తే, ఇరు కూటముల పరిస్థితి ఎలా వుంటుందో!

కులాల ప్రభావం, ప్రాంతీయ సమస్యలు, రాజకీయ వ్యూహాలు, వివిధ నాయకుల ప్రజాదరణ చుట్టూ మహారాష్ట్ర రాజకీయాలు తిరుగుతున్నాయి. బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, కుల సమీకరణాల వ్యూహాలతో ప్రజల్లోకి వెళ్తుంటే, ఎంవీయే నిరుద్యోగం, రైతుల సమస్యలు, ప్రభుత్వ వ్యతిరేకతను నమ్ముకుని ముందుకెళ్తోంది.

/ వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ. సెల్ : 99668 33329 /

★

జనవాక్యం

సహనంతో సహవాసం

ఐక్యరాజ్య సమితి సహనాన్ని పాటించమని చెప్తూ ప్రతి ఏడాది నవంబర్ 16వ తేదీని 'ప్రపంచ సహన దినోత్సవం'గా నిర్వహిస్తుంది. సహనం కోల్పోతే వచ్చే నష్టాలను చాటి చెప్పడమే ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం. వివిధ సంస్కృతులు, ప్రజల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడం ద్వారా ఐక్యరాజ్య సమితి సహనాన్ని ప్రోత్సహిస్తున్నది. సహనం, అహింసలే ప్రపంచ శాంతికి పునా దులు. వైజ్ఞానిక శాస్త్రం, సాంస్కృతిక వారసత్వం, సకల కళలు, విద్యా బోధనలు, విజ్ఞుల మాటలు లాంటివి సహనగుణ సంపద ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాయి. సహనం మన జీవన విధానంగా మారాలి. విద్యాలయాల్లో చిరుప్రాయం నుంచే సహన గుణం గూర్చి పాఠాలు నేర్పాలి. అసహన జ్వాలలు రేగితే శాంతి మటుమాయం అవుతుందని వివరించాలి. అసహనమే రక్తపాతాలకు కారణం అవుతుంది. అసహనంతో హింస జ్వాలలు ఎగిసి పడతాయి. సహనానికి తోబుట్టువు శాంతి అని తెలుసుకోవాలి. విభేదాలకు అసహనం ఆజ్యం పోసి, మానసిక శారీరక దూరాలను పెంచుతుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్న భారతదేశంలో సహనానికి పెద్ద పీట వేయాలి. నేడు ప్రపంచ దేశాల మధ్య విభేదాలు భీకర అనర్థాలకు, యుద్ధాలకు దారితీయడం చూస్తున్నాం. మానవాళి శ్రేయస్సు, స్వేచ్ఛ, అభివృద్ధి, పరస్పర గౌరవం, శాంతియుత చర్చలు, సమన్వయ సహకార ధోరణి, అర్థవంతమైన అంగీకార గుణం, ఇతరులను ప్రశంసించడం, ఇరుగు పొరుగు ఆచార వ్యవహారాలను గౌరవించడం, మాట్లాడే స్వేచ్ఛ నివ్వడం లాంటివన్నీ సహనశీలత వల్ల ఒనగూడుతాయి. సహనం మన జీవన విధానంలో ఓ భాగం కావాలి. ఇతరులను సముచితంగా గౌరవించడం, వారి అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, మానవ హక్కులను కాపాడడం లాంటివి సహనం ప్రసాదించిన సద్గుణాలు. సదాలోచనలను మింగేస్తుంది అసహనం. అందుకే సహనంతో సహవాసం చేయాలి.

- యం.రాం ప్రదీప్, తిరువూరు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేదెన్నడో?

పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో అత్తిలి మండల పరిధిలోని 35 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు, వైద్య సదుపాయం కోసం తిరిగే రోగులు, ఉద్యోగులు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆగకపోవడంతో రోడ్డు మార్గం ద్వారా 25 కిలో మీటర్లు ప్రయాణించి 'తణుకు' లేదా 'భీమవరం' వెళ్లాల్సి వస్తుంది. గత సంవత్సర కాలం నుండి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైల్వే అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. కావున పత్రికాముఖంగా చెప్పుకుంటే అయినా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశ.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా.

వైసిపి కో-ఆర్డినేటర్‌గా సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సజ్జల సలహాదారుగా పనిచేశారు.

బాల్య విద్య బలహీనం

> ప్రపంచంతో పోలిస్తే భారతీయ చిన్నారుల ఐక్యూ తక్కువే
> ఈ అంతరాన్ని ప్రభుత్వాలు తగ్గించాలి
> పిల్లలకు పోషకాహారం అందించాలి
> వారి మానసిక ప్రేరణపై దృష్టి పెట్టాలి
> మేధావులు, నిపుణుల సూచన

న్యూఢిల్లీ : నేటి బాలలే.. రేపటి భావి భారత పౌరులు. అలాంటి చిన్నారులకు దేశంలో బాల్య దశలో విద్య గగనమైపోతున్నది. దీంతో ఇది వారి మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నది. ఆ మెదడు వికాసానికి కావాల్సిన పోషకాహారమూ వారికి అందటం లేదు. అంగన్వాడీ కేంద్రాలు కనీస సౌకర్యాలనూ కలిగి ఉండటం లేవు. ఇది ప్రస్తుతం చిన్నారుల పైనే కాదు.. రేపటి దేశ తర్వాతి తరంపై, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్‌ను చేరుస్తామని ప్రచారం చేసుకుంటున్న మోడీ సర్కారు విద్య విషయంలో సరైన శ్రద్ధ కనబడటం లేదని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా, ఇది చిన్నారులకు సంబంధించిన పూర్వ బాల్య విద్య (ఇసిఇ)లో కనిపిస్తున్నదని అంటున్నారు.

చిన్నారులకు సంబంధించి సున్నా నుంచి ఆరేళ్ల వయసు మధ్య దాదాపు 85 శాతం మెదడు ఎదుగుదల జరుగుతుందని ప్రపంచవ్యాప్తంగా అనేక అధ్యయనాలు చెప్తున్నాయి. ఇలాంటి తరుణంలో మానసిక ప్రేరణకు సంబంధించి చర్యలు తీసుకుంటే వారి ఐక్యూ పెరుగుతుంది. ఇందుకు ఇసిఇ చాలా కీలకమని మేధావులు, నిపుణులు చెప్తున్నారు. చిన్నారుల ఐక్యూ స్థాయిని ప్రభావితం చేసేవాటిలో తగిన పోషకాహారం, ఉత్సుకతను రేకెత్తించే మానసిక ప్రేరణ ప్రధానమైనవి. చిన్నారుల, దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం పూర్వ బాల్య విద్య కీలకమని అనేక అధ్యయనాలు చెప్తున్నాయి.

భారతదేశ చిన్నారులు ప్రత్యేక ప్రతికూలతతో రేసును ప్రారంభిస్తారనీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్నారుల సగటు ఐక్యూ 97తో పోలిస్తే భారత చిన్నారులది 87గా ఉన్నదని గత అధ్యయనాలు వివరిస్తున్నాయి.

చిన్నారుల జ్ఞానాత్మక అభివృద్ధి విషయంలో నిర్మాణాత్మక పూర్వ బాల్య విద్య ప్రభావం గణనీయంగా ఉంటుందని గేట్స్ ఫౌండేషన్‌కు సంబంధించి ఒక అధ్యయనం వివరించింది. 2010లో 251 మంది చిన్నారులను పరిశోధకులు పరిశీలించారు. 18-24 నెలల పాటు నిర్మాణాత్మకమైన, అధిక-నాణ్యత కలిగిన పూర్వ బాల్య విద్యను అందుకున్నవారిలో ఐదు, తొమ్మిదేళ్ల వయసులో గణనీయంగా అధిక ఐక్యూను కలిగి ఉన్నట్టు గుర్తించారు. నిర్మాణాత్మకమైన, అధిక నాణ్యత కలిగిన పూర్వ బాల్య విద్యను అందుకున్న చిన్నారుల్లో ఐక్యూ 84కు పెరగగా.. ఆ విద్యను అందుకోని పిల్లల ఐక్యూ 79గా ఉన్నది. తొమ్మిదేళ్ల చిన్నారుల ఐక్యూ 93కు పెరగగా.. సదరు విద్యను అందుకోని పిల్లల ఐక్యూ 86గానే ఉండటం గమనార్హం.

కనీస సదుపాయాలూ లేని అంగన్వాడీలు

ఈ ఏజ్ గ్రూపులోని 15 కోట్ల మంది చిన్నారుల్లో.. దాదాపు 10 కోట్ల మంది (అంటే 60 శాతం) ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్వాడీ సేవలను అందుకుంటున్నారు. 1975లో ప్రారంభించబడిన చిన్నారుల సంరక్షణ కేంద్రాలైన ఈ అంగన్వాడీల ద్వారా చిన్నారులు రోజుకు కనీసం ఒక పోషకాహార భోజనాన్ని ఉచితంగా అందుకుంటున్నారు. చిన్నారుల మేధోపరమైన ఉత్సుకతను పెంపొందించే చర్యలపై ప్రత్యేక ప్రణాళికలేవీ కేంద్రం చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని అంగన్వాడీలలో టాయ్‌లెట్లు, నిరంతర నీటి సరఫరా, వాటర్ ఫిల్టర్లు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ఒక అధ్యయనం తెలిపింది.

35 శాతం మంది చిన్నారుల్లో పెరుగుదల లోపం

2030 నాటికి ఐదేళ్లలోపు వయసున్న 35 శాతం మంది భారతీయ చిన్నారులు పెరుగుదల లోపానికి (వయసుకు తగిన ఎత్తు లేకపోవటం) బాధితులుగా మిగలనున్నారు. ఈ సంఖ్య 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కింద నిర్దేశించిన లక్ష్యం కంటే రెట్టింపు కావటం గమనార్హం. ఈ విషయంలో కొన్ని రాష్ట్రాలు కొంత ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అంగన్వాడీల ద్వారా పోషకాహారాన్ని అందించే ప్రయత్నాన్ని చేస్తున్నాయి. చిన్నారుల ఐక్యూను మెరుగుపరిచే విద్య ఒకటే సరిపోదనీ, దానితో పాటు కడుపు కూడా నిండితేనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని నిపుణులు చెప్తున్నారు. 'పోషన్ బీ, పడాయి బీ' అనే నూతన ప్రచారాన్ని గతేడాది కేంద్రం ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా బడ్జెట్ మూడింతలైనా.. ఇందులో పూర్వ బాల్యదశ విద్యకు మూడు శాతం నిధులే కేటాయిస్తున్నారు. కనీసం పదిశాతానికైనా నిధులు పెంచాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు.

విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయండి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు తక్షణమే వైస్ ఛాన్స్‌లర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో 18 విశ్వవిద్యాలయాల్లో 101 విభాగాల్లో 418 ప్రొఫెసర్, 801 అసోసియేట్ ప్రొఫెసర్, 3,220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీ కోసం 2023లో నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. ఆయా పోస్టులను భర్తీ చేయడంలో గత వైసిపి ప్రభుత్వం విఫలమైందని లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పోస్టును భర్తీ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

తిరుమలలో ఎమ్మెల్యే కోటా పెంపు?

- బోర్డు సభ్యులకు రోజుకు 20 బ్రేక్ దర్శనాలు
- 'దివ్యదర్శనం' పునరుద్ధరణ
- 18న టిటిడి బోర్డులో నిర్ణయం!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలకు డిమాండ్ పెరిగింది. తమ కోటా పెంచాలంటూ మంత్రులు ఇటీవల జరిగిన క్యాబినెట్ భేటీలో ముఖ్యమంత్రిని కోరిన సంగతి తెలిసిందే ఈ నేపథ్యంలో కోటా పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. దీనితో పాటు అలిపిరి, శ్రీవారి మెట్ల మార్గం ద్వారా వచ్చే భక్తులకు 2008లో దివ్యదర్శనం పేరిట టోకెన్లు ఇచ్చే పద్ధతిని తిరిగి పునరుద్ధరించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పాలకమండలి సభ్యునికి సోమవారం నుంచి గురువారం వరకు నిత్యం 20 బ్రేక్ దర్శన టిక్కెట్లు, శని, ఆదివారాల్లో 12 చొప్పున టిక్కెట్లు జారీ చేస్తారని ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వీటితో పాటు వారానికి 4 సుప్రభాతంసేవలు, మరో 4 కళ్యాణోత్సవం టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఈనెల 18న జరుగనున్న టిటిడి నూతన పాలకమండలిలో కోటాకు సంబంధించి ఆమోదముద్ర వేయనున్నట్లు సమాచారం. ఇక ఎమ్మెల్యేల కోటా విషయానికి వస్తే ఇకపై వారంలో ఆరురోజులపాటు రోజుకు ఆరు చొప్పున సుపథం (రూ.300లు టిక్కెట్లు) ఇవ్వనున్నారు. ప్రస్తుతం వారానికి నాలుగు రోజులు పాటు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను అనుమతిస్తున్నారు. తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు ఆరురోజులు ఈ లేఖలను అనుమతివ్వనున్నారు. ఇదే సందర్భంలో తెలంగాణ ఎమ్మెల్యేలు సైతం తమ లేఖలను కూడా పరిగణలోకి తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పలుసార్లు కోరడం జరిగింది. ఈ విషయంపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

17న చెన్నైలో దక్షిణ భారత న్యాయవాదుల సదస్సు

ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ

ఈ ఏడాది జూలై 1 వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపి వేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీన చెన్నై తెనియంపేట్‌లోని కామరాజర్ హాల్‌లో తమిళనాడు, పుదుచ్చేరి న్యాయవాదుల (జాక్) ఆధ్వర్యంలో దక్షిణ భారత న్యాయవాదుల సదస్సును నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన "భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా అధినియం" చట్టాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించేవిధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో పోలీస్ యంత్రాంగానికి యథేచ్ఛగా అధికారాలను కల్పిస్తూ, న్యాయ వ్యవస్థకు ఉన్న అధికారాలను కుదిస్తూ, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వివరించారు. ఈ చట్టాల అమలు ప్రజలకు నష్ట దాయకమని దేశ వ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చెన్నైలో జరిగే సదస్సులో జాక్ ఛైర్మన్ పి. నంద కుమార్, ప్రధాన కార్యదర్శి కె. పన్నీర్ సెల్వన్, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు జి.రామ కష్ణన్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, ఐలు జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు బికాశ్ రంజన్ భట్టాచార్య, అనేక మంది ఎంపిలు, ఎంఎల్ఎలు, న్యాయవాద సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొనే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి న్యాయ వాదులు విరివిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఎఫ్‌సిఐలో ఉద్యోగాల పేరిట 60 మందికి టోకరా

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఆన్‌లైన్ సర్వీసులో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు చేస్తామని వేలాదిమందిని, ఎఫ్‌సిఐలో ఉద్యోగాలిప్పిస్తామని 60 మందిని కొందరు వ్యక్తులు మోసం చేశారని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమేజ్ లైఫ్ పి.ప్యాకెట్ ఆన్ లైన్ సర్వీస్ అనే స్కీమ్ పేరుతో మూడు వేల మంది బాధితులు మోసపోయారని పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన షేక్ అయేషా భాను, ఆమె భర్త జాకీర్, జహీర్ కలిసి మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోనికి చెందిన మొత్తం 60 మందిని మోసం చేశారు. నిందితులను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగం పేరుతో ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల 8 వేలు చొప్పున తీసుకున్నారు. నెలకు జీతం రూ.17,200 వస్తుందని వారిని నమ్మించారు. కర్నూలు పట్టణంలోని రామచంద్ర నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా తదితరుల ఫిర్యాదుతో నిందితులను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు.

సభకు రావొద్దంటే మానేస్తాను

- డిప్యూటీ స్పీకర్‌తో జ్యోతుల నెహ్రూ వాగ్వివాదం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో అధ్యక్షస్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక దశలో అసహనానికి గురైన నెహ్రూ సభకు రావొద్దంటే మానేస్తాంటూ డిప్యూటీ స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు. శుక్రవారం బడ్జెట్‌పై జరిగిన చర్చపై మాట్లాడేందుకు జ్యోతుల నెహ్రూకి అవకాశం ఇచ్చిన డిప్యూటీ స్పీకర్ 5 నిమిషాల్లో ముగించాలని కోరడంతో నెహ్రూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ ఎమ్మెల్యేకు ఐదు నిమిషాలు కేటాయిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత ప్రసంగం కొనసాగించారు. ఏడు నిమిషాలు మాట్లాడిన తరువాత బెల్లు కొట్టి ముగించాలని కోరడంతో జ్యోతుల నెహ్రూ మరింత అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ ఒక్క నిమిషం మాట్లాడిన తరువాత కలగజేసుకున్న రఘురామ.. "నెహ్రూ గారూ... సభ్యులు చాలా అసహనంగా ఉన్నారు. అర్థం చేసుకోవాలి. ముగించండి" అని అన్నారు. 'సారీ... సారీ... కూర్చోమంటే కూర్చుంటా' అని నెహ్రూ సమాధానం ఇచ్చారు. అయితే కూర్చోమని తాను అనడం లేదని, ప్రసంగాన్ని ముగించాలని మాత్రమే అంటున్నానని రఘురామ అన్నారు. ప్రతిస్పందించిన నెహూ... తనను ప్రతిపక్షంగా చూడకండి అని అన్నారు. "నేను మాట్లాడడం మొదలుపెట్టి మూడు నిమిషాలు కూడా కాలేదు. అడ్డొస్తుంటే ఎలా! అధ్యక్షా మీతో వాదన నాకొద్దు. కూర్చోమంటే కూర్చుంటాను. నాకు ఇబ్బందేమీ లేదు. ఎందుకంటే ముందు మాట్లాడిన వారెవరూ నా కంటే సీనియర్లు కాదు. వారికి ఇచ్చిన సమయం నాకు కూడా ఇవ్వాల్సిన బాధ్యత ఈ సభపై ఉంది. మీరు ఇస్తానంటే ఓకే. లేదంటే నేను కూర్చుంటాను. సభకు కూడా రావొద్దంటే మానేస్తాను" అని అన్నారు. స్పందించిన రఘురామ... "సార్... మీరు మాట్లాడడం మొదలుపెట్టి గడియారంలో 12 నిమిషాలు అయ్యింది. ఫినిష్ చేయమని అంటున్నాను అంతే" అని అన్నారు. అయితే పదికి పదిసార్లు తనను అడ్డుకోవడం చూస్తుంటే తనను ప్రతిపక్షం ఎమ్మెల్యేగా చూస్తున్నట్టు ఉందని, అది సరికాదని నెహ్రూ తిరిగి జవాబు ఇచ్చారు. తరువాత కూడా ఆయన ప్రసంగం కొనసాగింది. ఒక దశలో ఆయన మైకు కట్ చేశారు. మిగతా సభ్యులు .జోక్యం చేసుకుని మరో రెండు నిమిషాలు ఇవ్వండని కోరారు.

పోలవజరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

పోలవరం నిర్వాసితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని జ్యోతుల నెహ్రూ కోరారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజి సక్రమంగా అమలుచేయాలన్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వారికి వేరేచోట ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదన్నారు. ఇసుక విధానంలో మార్పులు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక వెళ్లకుండా నిరోధించాలని కోరారు. టిడిపి ప్రభుత్వంపై ప్రశంసలు, గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ నియోజకవర్గం సమస్యలు ప్రస్తావించారు. ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్నారు.

శ్రీశైలం ఇఒగా చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైలం శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం ఇఓగా తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్‌టి నెంబరు 823ని శుక్రవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు శ్రీశైలంలో ఇఓగా పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనరు ఇ.చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం రిలీవ్ చేసింది.

'ఇపిఎస్ 95' సమస్యపై షర్మిల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఇపిఎఫ్)-1995 పెన్షన్‌దారులకు ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక, కార్మికశాఖ మంత్రులు నిర్మలా సీతారామన్, ఎం మాండవీయను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రులకు ఆమె శుక్రవారం లేఖ రాశారు. ఇపిఎస్-95 పెన్షన్‌దారులకు అనుకూలంగా సుప్రీంకోర్టు రెండేళ్ల కిందట తీర్పు ఇచ్చినా కేంద్రం పట్టించుకోవడం లేదని లేఖలో పేర్కొన్నారు. ఈ ఆలస్యం ఇపిఎఫ్ఒ సంస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. మరోవైపు పెన్షన్‌దారులు తగినంత పెన్షన్ అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీరికి ఏడాది కాలంగా పెన్షన్ విడుదల కావడం లేదన్నారు.

మార్కెట్ బుడగ బ్లాస్ట్..!

- రెండు నెలల్లోనే 10 శాతం నష్టం
- సెన్సెక్స్ 8,000 పాయింట్ల క్షీణత
- నిఫ్టీ మరో రెండంకెల శాతం పడొచ్చు
- బేర్ పట్టు.. ఆగిన బుల్ రంకె
- దలాల్ స్ట్రీట్‌లో అప్రమత్తం



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశ ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా రెండేళ్లుగా రాకెట్‌లా దూసుకెళ్లిన దలాల్ స్ట్రీట్ అంతకంటే వేగంగా పడిపోతోంది. బేర్ పట్టు పెరగడంతో బుల్ వదిలేయగా.. మదుపర్లు బోరుమంటున్నారు. బిఎస్‌ఇ సెన్సెక్స్ ఆల్‌టైం గరిష్టాల నుంచి కేవలం రెండు నెలల్లోనే 8,000 పాయింట్లు మేర పతనమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ ఏకంగా 52 వారాల గరిష్ట స్థాయి 26,277 నుంచి 10 శాతం విలువ క్షీణించింది. నిఫ్టీలో మిడ్‌క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు రెండంకెల స్థాయిలో నష్టపోవడంతో సాధారణ మదుపర్లు భారీ నష్టాలను చవి చూశారని తెలుస్తోంది. కేవలం గురువారంతో ముగిసిన ఐదు సెషన్లలోనే రూ.20 లక్షల కోట్ల మేర సంపద హరించుకుపోవడంతో మదుపర్లు బెంబేలెత్తుతున్నారు. కరోనా కాలం మార్చి 2020 తర్వాత నిఫ్టీ ఈ స్థాయిలో పడిపోవడం ఇది రెండో సారి. 2022 ఏప్రిల్-జూన్‌లోనూ 15 శాతం పతనాన్ని చవి చూసింది. 2024 సెప్టెంబర్ 26న నిఫ్టీ50 ఏకంగా 26,216 పాయింట్ల రికార్డ్ స్థాయికి చేరింది. గురువారం నాడు 23,559 కనిష్టానికి పడిపోవడంతో.. రెండు నెలల్లోనే 10.14 శాతం పతనాన్ని చవి చూసినట్లయ్యింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 86వేల పాయింట్ల సమీపం నుంచి 9.49 శాతం కోల్పోయి 77,580కి పడిపోయింది.

ప్రధాన కారణాలు..

భారత ఆర్థిక వ్యవస్థలో పెద్ద సానుకూల పరిస్థితులు కానరావడం లేదు. ఇక్కడి మార్కెట్లపై విదేశీ పెట్టుబడిదారులు పెదవి విరుస్తున్నారు. ఒక్క నెలలోనే విదేశీ సంస్థాగత మదుపర్లు లక్ష కోట్ల పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. వారికి చైనా మార్కెట్లు ఆకర్షణీయంగా కనబడుతున్నాయి. పట్టణ వినిమయంలో తగ్గుదల చోటు చేసుకుంటుంది. దీంతో కార్పొరేట్ కంపెనీల రెవెన్యూ, రాబడిలపై ఒత్తిడి పెరుగుతోంది. దేశీయంగా ద్రవ్యోల్బణం ఎగిసిపడటం, అమెరికా డాలర్ విలువ పెరగడం, రూపాయి పతనం తదితర పరిణామాలు దలాల్‌స్ట్రీట్‌పై అనిశ్చితాన్ని పెంచాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే మరో 10 శాతం విలువ కోల్పోయే అవకాశాలు లేకపోలేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. బేర్ పట్టు మరింత పెరిగితే.. భారత స్టాక్ మార్కెట్ల బుడగ పేలిపోనుందని చెప్తున్నారు.

రూ.1.2 లక్షల కోట్ల ఎఫ్‌ఐఐలు ఔట్

రూ.1000 కోట్ల పైగా మార్కెట్ కాపిటలైజేషన్ కలిగిన 900 షేర్లు ఏడాది గరిష్టాల నుంచి ఏకంగా 20 శాతం పతనమయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు భారీ నష్టాలతో ఇప్పటికే బేర్ గుప్పిట్లోకి వెళ్లిపోయారు. రెండు నెలల క్రితం సెప్టెంబర్ 27న బిఎస్‌ఇ సెన్సెక్స్ 85,978 ఆల్‌టైం గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. నవంబర్ 14 నాటికి ఈ సూచీ ఏకంగా 78వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు భారత స్టాక్ మార్కెట్ల నుంచి రూ.1.2 లక్షల కోట్ల విలువ చేసే విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌ఐఐ) తరలిపోయాయి. చైనా ఇటీవల తర్వాతి తరం సమగ్రాభివృద్ధి, ఉద్దీపన విధానాలను ప్రకటించడంతో ఎఫ్‌ఐఐలు అక్కడికి వేగంగా తరలిపోయాయి. ఎఫ్‌ఐఐ విక్రయాలు ఆగకపోతే మార్కెట్ పరిస్థితులు మరింత దిగజారుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తం : నిపుణులు

ప్రస్తుత డిసెంబర్ త్రైమాసికంలోనూ స్వల్పంగా పడిపోవచ్చని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ మీటా శెట్టి విశ్లేషించారు. వచ్చే మార్చి త్రైమాసికంలో వృద్ధిలు పెరగడంతో కొంత మెరుగ్గా ఉండొచ్చన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో తిరిగి పుంజుకోవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్లు విలువ పరంగా భారీగా దిద్దుబాటుకు గురైతున్నాయని స్విస్టిక ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. 2020 తర్వాత తొలిసారి 2024 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత కంపెనీల రాబడి తగ్గడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని దెబ్బతీసిందన్నారు. మార్కెట్లో దిద్దుబాటు నేపథ్యంలో గడిచిన 4-5 నెలలుగా తమ బృందం నికర ఉత్తేజిత స్థాయి అంచనాలను తగ్గించిందని యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ప్రతినిధి జయేష్ సుందర్ పేర్కొన్నారు. భారీగా ఎఫ్‌ఐఐలు తరలిపోవడంతో మరికొన్ని నెలలు మార్కెట్లు స్తబ్దతలోనే ఉండొచ్చన్నారు. దలాల్ స్ట్రీట్‌లో క్లిష్ట పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

కొనలేం.. తినలేం..

- ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు
- ధరల తగ్గింపునకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - రాజోలు, అయినవిల్లి

నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యుడు భగ్గుమంటున్నాడు. కూరగాయల ధరలు పప్పులు, నూనెలు, బియ్యం ఇలా ఒక్కటేమిటీ దేనిని పట్టుకున్నా షాక్ కొట్టేలా పరిస్థితి ఉంది. పిల్లల చదువులు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇంటి కిరాయిలు ఇతర ఖర్చులకు అరకొర సంపాదించే సామాన్యుడి జీతం నెల తిరిగేసరికి ఆవిరైపోతోంది. ఇక దినసరి కూలీ సంగతి సరేసరి. నిత్యావసర సరుకులు పెరుగుదల పై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిగా సరుకుల ధరలు పెరిగిపో తున్నాయి. ఫలితంగా సామాన్యుడు పెరిగిన ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

తలకిందులవుతోన్న కుటుంబ బడ్జెట్

గత కొంతకాలంగా పెరిగిన ధరలు, ఇతర వ్యయాలతో కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది. ఇంటి కిరాయిలు, పాలు, చక్కెర, పప్పులు, బియ్యం, కూరగాయలు, ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యుల నోట మాట రావడం లేదు. ప్రస్తుతం లీటరు నూనె ప్యాకెట్ పై ఏకంగా రూ.20 నుంచి రూ. 45కు పెరిగింది. బియ్యం ధరలు క్వింటాల్ కు రూ.300 నుంచి రూ.500 పెరిగాయి. ఇక పప్పుల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. పెరిగిపోతున్న నిత్యా వసరాల ధరలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సైతం పెరిగి పోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

గడిచిన రెండు నెలల్లోనే..

గత రెండు నెలల నుండి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒకవైపు నిత్యావసర సరుకులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగి పోవడంతో ఏమి కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.2,050కి పైగానే పలుకుతోంది. వెల్లుల్లి ధర అసలు కిందకు దిగిరానంటోంది. ప్రస్తుతం కేజీ వెల్లుల్లి ధర రూ.320గా ఉంది. దీంతో సామాన్య ప్రజలు 'ఏమి కొనలేం.. ఏం తినలేం..' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణ దారులు నష్టపోతున్నారు. ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు, కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం

ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. గత వైసిపి ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేసింది.నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్డు దారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా బియ్యంతో సరిపెడుతోంది. కందిపప్పు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గాడిద పాల పేరిట రూ.100 కోట్ల మోసం!

- తెలుగు రాష్ట్రాల్లో రైతులను ముంచిన చెన్నై ముఠా
- న్యాయం చేయాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరిన బాధితులు


ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

గాడిద పాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని తమిళనాడుకు చెందిన ఓ ముఠా తెలుగు రాష్ట్రాల్లోని రైతులను నమ్మించి మోసగించింది. గాడిద పాల ఉత్పత్తి, లాభాల పేరుతో ఆశ చూపి రూ.100 కోట్ల వరకు ఎగవేసింది. మోసపోయిన రైతులు శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తమ గోడు వెలిబుచ్చారు. చెన్నైలోని డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీ గ్రూపు సభ్యులు తమను నమ్మించి నిలువునా మోసగించారని వాపోయారు. బాధితుల కథనం ప్రకారం... కొవిడ్ నేపథ్యంలో బహుళ పోషకాలు, రోగ నిరోధకశక్తి ఇచ్చే గాడిద పాలకు డిమాండ్ ఉందంటూ డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీ గ్రూపు సంస్థ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. దీనిని చూసి పలువురు రైతులు సంస్థను సంప్రదించారు. డాంకీ ప్యాలెస్ సంస్థలో బాబు ఉలగనాథన్, గిరి సుందర్, బాలాజీ, సోనికరెడ్డి, డాక్టర్ రమేశ్ బృందం సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కొక్క రైతు నుంచి రూ.5 లక్షల చొప్పున తీసుకుంది. ఒక్కో పాడి గాడిదను రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షలకు విక్రయించింది. ఆ గాడిదల నుంచి ఉత్పత్తి చేసిన పాలను లీటరుకు రూ.1,600 చొప్పున సేకరిస్తామని ఒప్పందం చేసుకుంది. మూడు నెలలపాటు నమ్మకం కలిగించేలా నగదు చెల్లించింది. గత 18 నెలలుగా డాంకీ ప్యాలెస్‌కు సరఫరా చేసిన పాల డబ్బులు, నిర్వహణ ఖర్చులు, షెడ్ నిర్మాణం, సిబ్బంది జీతాలు, వెటర్నరీ చికిత్స ఖర్చులు ఇవ్వడం లేదు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే ఒక్కొక్కరికీ రూ.15 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు బ్యాంకు చెక్కులు రాసిచ్చింది. అవి బ్యాంకులో వేస్తే బౌన్స్ అయ్యాయి. మోసపోయామని గ్రహించిన రైతులు చెన్నై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అక్కడి పోలీసులు పట్టించుకోలేదు. ఒప్పందం సందర్భంగా ఇచ్చిన జిఎస్‌టి సంఖ్య, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్ నకిలీవని తేలిందని రైతులు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 400 మందికిపైగా రైతులు నష్టపోయారని తెలిపారు. ఇదో పెద్ద కుంభకోణమని, దీని వెనుక రాజకీయ పెద్దల హస్తం ఉండొచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎపి, తెలంగాణ ప్రభుత్వాలు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.

ధాన్యం కొనుగోలు ఎప్పుడు..?

- నేటికీ ఖరారు కాని ధాన్యం లక్ష్యం
- తొమ్మిది లక్షల టన్నులు రావచ్చని వ్యవసాయశాఖ అంచనా
- 4.90 లక్షల టన్నులు సేకరించాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయం
- పూర్తిస్థాయిలో కొనాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటికీ లక్ష్యం ఖరారు కాలేదు. జిల్లాలో ఈ ఏడాది తొమ్మిది లక్షల టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అధికారులు, ఉన్నతాధికారుల సూచన మేరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటీవల ఖరీఫ్ ధాన్యం సేకరణపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించి జిల్లాలో ఎంతమేర దిగుబడి వస్తే, అంత పరిమాణంలో ధాన్యం కొనాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం పెంచి కొనుగోలు చేయాలని భావిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి పంట వేశారు. ఈ ఏడాది తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఐదు లక్షల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్ని లెక్కగట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా కొనుగోలు కోసం 402 కేంద్రాలను గుర్తించారు. ఇటీవల వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి, దిగుబడి వచ్చిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ధాన్యం సేకరణ పెంచే దిశగా ఆలోచన చేస్తున్నారు. అందుకనుగుణంగా ఏర్పాట్లును చేసే పనిలో నిమగ్నమయ్యారు. అదనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల గుర్తింపు, మిల్లుల కేటాయింపు, సిబ్బంది నియమాకంపై దృష్టిసారించారు. దీంతో ధాన్యం కొనుగోలు ప్రారంభం మరింత జాప్యం కావచ్చని అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈనెల 17వ తేదీ నుంచి ధాన్యం కొనాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే కొంత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ధాన్యం సేకరణ ఈనెల 20వ తేదీ తర్వాత ప్రారంభం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ధాన్యం కొనుగోలులో స్వల్ప మార్పులు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం స్వల్పంగా కొన్ని మార్పులు చేసింది. గతంలో ధాన్యం ఏ మిల్లుకు వెళ్లాలో సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్ణయించేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. ధాన్యం కొనుగోలులో గతేడాది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ విలువ పూర్తవడంతో దూర ప్రాంతాల్లోని మిల్లులకు కేటాయించారు. ముఖ్యంగా ఒక మండలానికి చెందిన రైతులకు 40, 50 కిలోమీటర్ల దూరంలో వేరే మండలంలో ఉన్న మిల్లులకు కేటాయించారు. దీంతో రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. ఈసారి ఆరకమైన ఇబ్బందులు తప్పనున్నాయి.

రైతులకు మద్దతు ధర దక్కేనా?

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరికి సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది కొంతమంది రైతులు తీసుకువెళ్లినా ధాన్యం నాణ్యంగా లేవంటూ తిప్పి పంపారు. కొన్ని రైతుభరోసా కేంద్రాల్లో తమ లక్ష్యం పూర్తయిందని ఇక కొనలేమంటూ సిబ్బంది చెప్పడంతో, దళారులకు తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పటికే జలుమూరు, సారవకోట, నరసన్నపేట, బూర్జ మండలాల్లో తక్కువ ధరకే రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది. 80 కేజీల బస్తాను రూ.1400 నుంచి రూ.1450 మధ్య కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అటు తూకంలోనూ దళారులు మూడు నుంచి నాలుగు కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు.

సిబ్బంది నియామకం బాధ్యత ఏజెన్సీలదే...

కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికపై ఏటా ప్రభుత్వమే నియమించేది. వారికి నాలుగు నెలల పాటు వేతనాలు చెల్లించేది. ఈసారి ధాన్యం కొనుగోలు చేపట్టనున్న పిఎసిఎస్, డిసిఎంఎస్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు తదితర ఏజెన్సీలే సిబ్బందిని నియమించుకోవాలని అధికారులు సూచించారు. గతంలో ప్రభుత్వం వేతనాలు చెల్లించడంతో, వారికి సకాలంలో జీతాలు రావడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన మేర డబ్బులు వచ్చేవి. ఇప్పుడు ఏజెన్సీలు బాధ్యతలు తీసుకోవడంతో అవి ఎంతవరకు కచ్చితంగా అమలవుతాయో చూడాల్సి ఉంది.

అమెరికా సైన్యంలో ఏటా పెరుగుతున్న ఆత్మహత్యలు

వాషింగ్టన్ : అమెరికా సైన్యంలో ప్రతీఏటా ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండటం అక్కడి అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్ని ఉపశమన చర్యలు తీసుకుంటున్నా సైన్యంలో ఆత్మహత్యలు పెరుగుతుండటంతో అధికారులు కలవరపడుతున్నారు. గురువారం విడుదల చేసిన డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ నివేదిక ప్రకారం అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2023లో అమెరికా సైన్యంలో ఆత్మహత్యలు పెరిగాయి. 2022లో ఆత్యహత్యల సంఖ్యలో కొద్దిగా తగ్గుదల కనిపించినా 2023లో మళ్లీ పెరిగాయి. నివేదిక ప్రకారం 2023లో 523 మంది సైనికులు ఆత్మహత్య చేసుకున్నారు. 2022లో 493 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2011 నుంచి అమెరికా సైన్యంలో ఆత్మహత్యల ధోరణి పెరుగుతూ వస్తోంది. ఆత్మహత్యలు చేసుకుంటున్నవారిలో ఎక్కువ మంది తుపాకీతో కాల్చికుని ప్రాణాలు విడుస్తున్నారు. అలాగే ఆత్మహత్యలు చేసుకుంటన్నవారిలో ఎక్కువ మంది యువకులే. కుటుంబ కారణాలు, ఆర్థిక కారణాలతో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అధికారులు చెబుతున్నా ఇది సరైన కారణం కాదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సైనికుల్లో ఆత్మహత్యలను తీవ్రంగా తీసుకుంటున్నట్లు డిఫెన్స్ సెక్రటరీ లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. సైనికులకు మానసిక ఆరోగ్య సహాయాన్ని పెంచడానికి, తుపాకీ భద్రత, నిల్వపై మరింత అవగాహన పెంచడానికి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.



త్వరలో ఆడి క్యూ7 బుకింగ్స్ షురూ..

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి తన కొత్త ఆడి క్యూ7కు నవంబర్ 28 నుంచి బుకింగ్స్‌ను తెరువనున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త మోడల్‌ను రూ.2 లక్షలతో తమ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపింది. 3.0 లీటర్ల వి6 టిఎఫ్‌ఎస్‌ఐ పవర్‌ఫుల్ ఇంజిన్‌తో దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపింది. ఇది కేవలం 5.6 సెకన్లలోనే గంటకు సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదని వెల్లడించింది. టాప్ స్పీడ్ గంటకు 250 కిలోమీటర్లుగా ఉందని తెలిపింది. దీన్ని ఔరంగబాద్ ప్లాంట్‌లో అసెంబ్లింగ్ చేసినట్లు వెల్లడించింది. కాగా.. దీని ధరను వెల్లడించలేదు.



మార్గానిసత్యనారాయణను సత్కరిస్తున్న బ్యాంక్ అధికారులు

ఉత్తమ నర్సరీ రైతు 'మార్గాని'కి యుబిఐ సత్కారం

ప్రజాశక్తి- కడియం (తూర్పుగోదావరి జిల్లా)

గల్లీ నుంచి ఢిల్లీ వరకు తన నర్సరీ వ్యాపారాన్ని విస్తరించిన ఉత్తమ రైతు, శ్రీ వీరహనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఘనంగా సత్కరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వార్షికోత్సవ వేడుకలు రాజమహేంద్రవరం సూర్య గార్డెన్స్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్గాని సత్యనారాయణను ఆహ్వానించి ప్రత్యేకంగా సత్కరించారు. బ్యాంకు లావాదేవీల్లో నిజాయతీ నిబద్ధత కలిగిన ఉత్తమ రైతు మార్గాని సత్యనారాయణ అని యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరావు అన్నారు. రైతు మార్గాని మాట్లాడుతూ నాటి ఆంధ్రాబ్యాంకు నుంచి నేటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరకు రెండు దశాబ్దాలుగా బ్యాంకు సేవలు పొందానని తెలిపారు. తనలాంటి వందలాదిమంది నర్సరీ రైతులకు బాసటగా కడియం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛీఫ్ మేనేజర్ సుభాష్ పాల్గొన్నారు.

జాగల్ ప్రీపెయిడ్ లాభాలు మూడు రెట్లు

హైదరాబాద్ : ఫిన్‌టెక్ వేదిక జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మూడు రెట్లు పెరిగి రూ.20.3 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.7.62 కోట్ల లాభాలు ప్రకటించింది. అదే సమయంలో రూ.184.2 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో రూ.302.5 కోట్లకు పెరిగింది.

'మహా' కోడ్ ఉల్లంఘనలు

- ఇసికి ఆరువేలకు పైగా ఫిర్యాదులు
- రూ.536 కోట్ల విలువ చేసే నగదు, మద్యం స్వాధీనం
- ఎన్నికల సంఘం వెల్లడి

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనలు భారీ సంఖ్యలో జరుగుతున్నాయి. రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా ఎన్నికల సంఘం (ఇసి)కి ఇప్పటికే ఆరువేలకు పైనే ఫిర్యాదులు అందాయి. అలాగే, రూ.500 కోట్లకు పైగా విలువ చేసే నగదు, మద్యం, ఇతర ఖరీదైన వస్తువులు సీజ్ అయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సమాచారం ప్రకారం..కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఇసికి 6,382 ఫిర్యాదులు అందాయి. ఇసి కింద ఉండే ఏజెన్సీలు రాష్ట్రంలో రూ.536 కోట్లకు పైగా విలువ చేసే నగదు, వస్తువులను సీజ్ చేశాయి. రాష్ట్రంలో గతనెల 15న ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) వెంటనే అమలులోకి వచ్చిన విషయం విదితమే. అప్పటి నుంచి ఈనెల 14 మధ్య ఎన్నికల సంఘానికి చెందిన సివిజిల్ యాప్ ద్వారా ఈ ఫిర్యాదులు అందాయి. అలాగే, రూ.536.45 కోట్ల విలువ చేసే అక్రమ నగదు, మద్యం, నార్కొటిక్స్, విలువైన ఆభరణాలను కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఈనెల 23న వెలువడనున్న విషయం విదితమే.

సెబి నిష్పాక్షికతపై నీలి నీడలు

• అదానీ - బచ్ వ్యవహారంలో కానరాని పారదర్శకత • కీలక ప్రశ్నలకు సమాధానాలు దాటవేత

న్యూఢిల్లీ : పరస్పర విరుద్ధ ప్రయోజనాలతో ముడిపడిన కేసుల విచారణ నుండి తమ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్ తనంతట తాను వైదొలిగారని ఆగస్టులో 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ఓ ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూపుతో సంబంధమున్న ఆఫ్‌షోర్ సంస్థలతో బచ్‌కు లావాదేవీలు ఉన్నాయని, వాటిని బచ్ బహిర్గతం చేయలేదని మెరికా షార్ట్-సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై వివరణ ఇస్తూ సెబి ఈ ప్రకటన జారీ చేసింది. అయినప్పటికీ పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో సెబి పారదర్శకతపై ఇప్పటికీ అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవలి పరిణామాలు దీనికి బలం చేకూరుస్తున్నాయి.

సమాచారం సిద్ధంగా లేదట !

సెబి చేసిన ప్రకటన నేపథ్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కింద అభ్యర్థన దాఖలైంది. అదానీ గ్రూపుపై జరుగుతున్న విచారణల్లో వేటి నుండి బచ్ వైదొలిగారో తెలియజేయాలని అందులో కోరారు. దీనిపై సెబి స్పందిస్తూ 'ఆ సమాచారం ఇప్పుడు సిద్ధంగా లేదు' అని బదులిచ్చింది. సమాచారాన్ని అందజేయకుండా తప్పించుకునేందుకు ఆర్టిఐలోని సెక్షన్ 7 (9)ని సాకుగా చూపింది. దీంతో సెబి పారదర్శకతపై మరిన్ని అనుమానాలు రేకెత్తుతున్నాయి. ముఖ్యంగా దర్యాప్తు సంస్థ నిష్పాక్షికతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్న వేళ అది ఇచ్చిన సమాధానం అనేక ప్రశ్నలకు



అవకాశం కల్పిస్తోంది. ఆర్టిఐలోని సెక్షన్ 7 (9)ని వర్తింపజేయడం తప్పుదో పట్టించడమే అవుతుందని సమాచార హక్కు కార్యకర్త లోకేష్ బత్రా చెప్పారు. సమాచారం తెలుసుకోకుండా అడ్డుకోవడానికి ఈ సెక్షన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ కవచంగా ఉపకరించదని, కీలకమైన ప్రజా ప్రయోజన విషయాలను బహిర్గతం చేయకుండా తప్పించుకోవడానికి అది ఓ మార్గం కాదని ఆయన స్పష్టం చేశారు.

హిండెన్‌బర్గ్ తాజా నివేదిక ఏం చెప్పింది?

సెబి దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో హిండెన్‌బర్గ్ సంస్థ ఆగస్టులో ఓ ఫాలో-అప్ నివేదికను ప్రచురించింది. అందులో అది తన దృష్టిని అదానీ నుండి నేరుగా సెబి వైపు మళ్లించింది. అదానీ నెట్‌వర్క్‌తో సంబంధమున్న ఆఫ్‌షోర్ ఫండ్స్‌తో బచ్‌కు లావాదేవీలు ఉన్నాయని, వాటిని ఆమె బహిర్గతం చేయలేదని, ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన విషయమేనని హిండెన్‌బర్గ్ ఆ నివేదికలో ఆరోపించింది. నిధులను మళ్లించేందుకు, వాటాల విలువను ప్రభావితం చేసేందుకు బచ్, ఆమె భర్త కలిసి అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఉపయోగించిన ఫండ్స్‌లో వాటాలు కొనుగోలు చేశారని తెలిపింది. ఈ ఆరోపణలపై స్పందించిన సెబీ ఆగస్టు 10న ఓ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాల విచారణ నుండి బచ్ తనంతట తాను తప్పుకున్నారని తెలిపింది.

లోకేష్ బత్రా ఏమన్నారు?

ఆర్టిఐ కింద సెబి ఇచ్చిన సమాధానం పేలవంగా ఉండడంపై లోకేష్ బత్రా అసంతృప్తి వ్యక్తం చేశారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న ఏయే కేసుల విచారణ నుండి బచ్ వైదొలిగారో చెప్పేందుకు సెబి నిరాకరించడాన్ని బట్టి దర్యాప్తు సంస్థలో పారదర్శకత లోపించిందని అర్థమవుతోందని ఆయన అన్నారు. కీలకమైన సమాచారాన్ని అందించకుండా తప్పించుకునేందుకు సెబి ఉద్దేశపూర్వకంగా ఈ సెక్షన్‌ను అడ్డం పెట్టుకున్నదని విమర్శించారు. సెబి స్పందన దాని విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తోందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. అదానీ గ్రూపుపై జరుగుతున్న విచారణల్లో తాను నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నానంటూ సెబి గొప్పలు చెప్పుకుంటోందని, అయితే సమాచారాన్ని దాచిపెట్టడంలో దాని డొల్లతనం బయటపడిందని వారు అన్నారు.

కష్టాల కడలిలో మహారాష్ట్ర రైతులు

- పెరుగుతున్న ఆత్మహత్యలు
- బాలకార్మికులుగా మారుతున్న చిన్నారులు
- కాడి కింద పడేసిన డబుల్ ఇంజిన్ సర్కార్

ముంబయి : పంట రుణాలు చెల్లించలేక దిక్కుతోచని పరిస్థితుల్లో మహారాష్ట్రలో అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతుల ఆత్మహత్యలు అధికార మహాయుతి ప్రభుత్వాన్ని కలవరపెడుతున్నాయి. తన తండ్రి విషం తీసుకొని చనిపోయాడని 13 సంవత్సరాల గోపికర్ చెప్పాడు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి దూరం కావడంతో ఇప్పుడతను పూనెలోని స్నేహవాన్ ఆశ్రమంలో తలదాచుకుంటున్నాడు. వితంతువైన తల్లికి దూరంగా కాలం గడుపుతున్నాడు. ఆమె గ్రామంలో పొలాల్లో దినసరి కార్మికురాలిగా పనిచేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ప్రతి రైతు ఇంటా ఇలాంటి కన్నీటి గాథలే. శివసేన ప్రభుత్వాన్ని కూల్చివేసి తన బంటును గద్దెనెక్కించిన మోడీ సర్కార్.. మహారాష్ట్రకు చేసిందేమీ లేదని రైతన్నలు వాపోతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కానీ, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్‌తో పని చేస్తున్న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం కానీ అన్నదాతలను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శిస్తున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ కాడి కింద పడేసి తమను ఇబ్బందుల్లో నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విదర్భ, మరట్వాడాల్లో మరింత దారుణం

విదర్భ, మరట్వాడా ప్రాంతాలలో వేలాది మంది చిన్నారులు అనాథలుగా మారిపోయారు. రుణభారంతో కన్నవారు ఆత్మహత్యలకు పాల్పడడంతో వారంతా దిక్కులేని వారయ్యారు. రాష్ట్రంలో బలవన్మరణాలకు పాల్పడిన రైతుల్లో 90 శాతం మంది ఈ రెండు ప్రాంతాలకు చెందిన వారే. గత సంవత్సరం రాష్ట్రంలో 2,851 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బలవన్మరణం చేసుకున్న ప్రతి రైతు ఇంట సగటున ముగ్గురు కుటుంబ సభ్యులు సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారికంగా 2,851 ఆత్మహత్యలు నమోదు కాగా సుమారు ఐదు వేల మంది చిన్నారులు ఆ ఏడాదిలోనే అనాథలయ్యారు. పేదరికంతో విద్యకు దూరమయ్యారు. దీంతో బాల కార్మికులుగా మారిపోవాల్సిన దుస్థితి నెలకొంది.

కరువు కోరల్లో...

గత సంవత్సరం మహారాష్ట్రలోని 66 శాతం ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుపోయింది. ఈ సంవత్సరం మే నాటికి అది 73 శాతానికి పెరిగింది. గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో 8000 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో 52 శాతం మంది మరత్వాడా, 39 శాతం మంది విదర్భ ప్రాంతాలకు చెందిన వారే. కరువు సహాయక చర్యలు కానీ, రుణ మాఫీలు కానీ రైతుల కష్టాలను తీర్చడం లేదు.

గుజరాత్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

- 700 కేజీల మెథాంఫెటమిన్ స్వాధీనం
- దాని విలువ దాదాపు రూ.1700 కోట్లుగా అంచనా
- 8 మంది ఇరానీయన్ల అరెస్ట్ • ఎన్‌సిబి వెల్లడి

గాంధీనగర్ : గుజరాత్ తీరంలో మరొకసారి భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం కలకలం రేపింది. భారత నౌకాదళం, గుజరాత్ పోలీసులు, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) అధికారులు చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో.. భారత సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్న ఒక బోటులో 700 కేజీల మెథాంఫెటమిన్ గుర్తించారు. పట్టుబడ్డ డ్రగ్ విలువ దాదాపు రూ.1700 కోట్లుగా ఉంటుందని వారు అంచనా వేశారు. బోటులో ఉన్న ఎనిమిది మంది విదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాము ఇరానీయన్లమని అరెస్టయినవారు చెప్పినట్టు అధికారులు తెలిపారు. డ్రగ్స్‌తో ఒక బోటు భారత జలాల్లోకి ప్రవేశిస్తున్నదని నిఘావర్గాల నుంచి అందిన సమాచారం మేరకు తాము రంగంలోకి దిగామని ఎన్‌సిబి అధికారి జ్ఞానేశ్వర్ సింగ్ వెల్లడించారు. సాగర్-మంతన్-4 కోడ్ పేరుతో ఆపరేషన్‌ను చేపట్టామని వివరించారు.డ్రగ్ సిండికేట్‌లో సంబంధాలను గుర్తించటానికి దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. ఇందుకోసం విదేశీ ఏజెన్సీల సాయాన్ని కోరుతున్నామని చెప్పారు. గుజరాత్‌లో వరుసగా డ్రగ్స్ పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఏడాది మూడు కేసుల్లో ఇప్పటి వరకు 11 మంది ఇరాన్ దేశస్థులు, 14 మంది పాకిస్థానీలు అరెస్టయ్యారు. వారంతా గత తొమ్మిది నెలలుగా జైలులో మగ్గుతున్నారు. అధికారులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లలో పోర్‌బందర్ దగ్గర అరేబియన్ సముద్రం నుంచి 4000 కేజీలకు పైగా డ్రగ్స్ స్వాధీనమైంది. తొమ్మిది నెలల క్రితం ఎన్సీబీ, గుజరాత్ ఏటీఎస్, నేవీ చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో భారీ ఎత్తున 3,132 కేజీల పలు రకాల డ్రగ్స్ పట్టుబడింది. మరొక మేజర్ ఆపరేషన్‌లో భాగంగా రూ.60 కోట్ల విలువ చేసే 173 కేజీల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.



జార్ఖండ్ ఎన్నికల ప్రచారసభలో బృందాకరత్ అభివాదం

బిజెపి గెలిస్తే వనరుల లూటీ

రాంఛీ : జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఇక్కడి వనరులను బడా కార్పొరేట్లు దోపిడి చేస్తారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. సిపిఎం అభ్యర్థి లఖన్ లాల్ మండల్‌కు మద్దతుగా జమ్తాడ అసెంబ్లీ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బృందాకరత్ ప్రసంగించారు. కాబట్టి బిజెపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించి తీరాలని, కాషాయ నేతల చొరబాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలతో నిత్య వనరులను కాపాడుతూ వస్తున్న సిపిఎంను గెలిపించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన కాకుండా బిజెపి మతతత్వ అజెండాతో ప్రచారం దట్టిస్తోందని, ఆదివాసీలకు, ఇతర సామాజిక తరగతుల ప్రజలకు మధ్య చిచ్చురాజేసి జార్ఖండ్‌లో కాషాయ పార్టీ లబ్ధి పొందాలని కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. ప్రజలందరికీ విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై రాజకీయ నేతలు దృష్టి సారించేలా ప్రజలు డిమాండ్ చేయాలని, అలాంటి ప్రజా సమస్యలపై చర్చ జరగాలని బృందాకరత్ అన్నారు.

పినాకా రాకెట్ లాంచర్ సక్సెస్

న్యూఢిల్లీ : భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) పినాకా రాకెట్ లాంచర్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా వెపన్ సిస్టమ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్‌ను డిఆర్‌డిఒ అభివృద్ధిచేసింది. పినాకా ఆయుధ వ్యవస్థకు చెందిన రేంజ్, కచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని, ఫైరింగ్ రేట్‌ను పరీక్షించారు. ప్రొవిజినల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్స్ ట్రయల్స్‌లో భాగంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను టెస్ట్ చేశారు. పినాకా లాంచర్ల ద్వారా 12 రాకెట్లను ఫైరింగ్ చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఆర్మీ వద్ద ఉన్న రష్యన్ గ్రాడ్ బిఎం-12కు బదులుగా ఈ రాకెట్ సిస్టమ్‌ను తయారు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో దీన్ని వినియోగించారు. వ్యూహాత్మకంగా ఎత్తు ప్రదేశాల్లో ఉన్న పాకిస్థాన్ స్థావరాలను పికానా సిస్టమ్ ద్వారా పేల్చివేశారు. ఆర్మమెంట్ రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ పినాకా రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేసింది.

ప్రధాని మోడీ విమానంలో సాంకేతిక లోపం

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ ప్రయాణిస్తున్న వాయుసేన ప్రత్యేక విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆయన జార్ఖండ్‌లోని దేవఘర్ విమానశ్రయంలో రెండు గంటల పాటు వేచిచూడాల్సివచ్చింది. దేవఘర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీహార్‌లోని జమూయిలో ఆదివాసీ నేత బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన 'జనజాతీయ గౌరవ్ దివస్' వేడుకల్లో పాల్గొని అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమవ్వగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆ తర్వాత మరో విమానంలో మోడీ ఢిల్లీకి వెళ్లారు.

రాహుల్ హెలికాప్టర్‌కు అనుమతులు జాప్యం

కాగా జార్ఖండ్‌లోని గోడ్డాలో రాహుల్ గాంధీ హెలికాప్టర్‌కు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే ఇది సాంకేతిక సమస్య కారణంగా కాదు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి ఆయన హెలికాప్టర్‌కు



క్లియరెన్స్ రావడంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో ఆయన హెలికాప్టర్ 45 నిమిషాల పాటు గ్రౌండ్‌పైనే ఉండిపోయింది. అసెంబ్లీ ప్రచారాన్ని అడ్డుకోవాలనే రాహుల్ హెలికాప్టర్‌కు సమస్య వచ్చేలా 'కుట్ర' పన్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. దీనిపై ఎన్నికల సంఘానికి కూడా కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

పెట్టుబడుల లక్ష్యాల్లో 'క్లైమేట్ ఫైనాన్స్'ను కలపొద్దు

- సంపన్న దేశాలను కోరిన భారత్
- కాప్-29 చర్చల నుంచి అర్జెంటీనా వాకౌట్
- హాజరు కాని ఫ్రాన్స్ మంత్రి

బాకు, న్యూఢిల్లీ : పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లేలా ప్రోత్సహించడాన్ని, వినియోగాన్ని సులభతరం చేయడానికి అవసరమైన ఆర్థిక సాయం అందించడాన్ని సంపన్న దేశాలు 'పెట్టుబడి లక్ష్యాలు'గా చూడ కూడదని భారత్ పేర్కొంది. అలాగే క్లైమేట్ ఫైనాన్స్ ఎవరు అందించాలి, ఎవరు సమీకరించాలి అనే దాన్ని పారిస్ ఒప్పందం స్పష్టంగా పేర్కొందని కూడా భారత్ గుర్తు చేసింది. భారత ప్రధాన సంధానకర్త నరేష్ పాల్ గాంగ్వార్ ఈ వివరాలను కాప్ 29 సదస్సులో మాట్లాడుతూ తెలిపారు. నరేష్ పాల్ గాంగ్వార్ చేసిన ప్రసంగాన్ని భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారికంగా శుక్రవారం విడుదల చేసింది. 'వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా పోరాటంలో మేం కీలకమైన దశలో ఉన్నాం. మనం ఇక్కడ (బాకులో) నిర్ణయించుకోవాల్సింది ప్రపంచానికి ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు ప్రధానమైన ఉపశమన చర్యలు తీసుకోవాలి, ఆర్థిక సహాయం స్వీకరించడానికి వీలు కల్పించాలి. అప్పుడే కాప్ చారిత్రాత్మకం అవుతుంది' అని గాంగ్వార్ పేర్కొన్నారు. అజర్‌బైజాన్‌లోని బాకులో జరుగుతున్న ఐరాస కాప్29లో సాంకేతిక, గ్లోబల్ వార్మింగ్ వంటి అంశాలపైనా చర్చలు జరుగుతున్నా..'క్లైమేట్ ఫైనాన్స్' అనేదే ప్రధాన అంశంగా ఉన్న సంగతి తెలిసిందే. క్లైమేట్ ఫైనాన్స్‌పై నూతన కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ (ఎన్‌సిక్యూజి) నిర్ణయించడమే ప్రధాన ఎజెండాగా ఈ సమావేశం ప్రారంభమయింది. 2009లో అంగీకరించబడిన దాని ప్రకారం 2025 ఏడాది వరకూ సంవత్సరానికి 100 బిలియన్ల డాలర్లను అందించాలి. అయితే ఇది 2022లో ఒక్కసారి మినహా ఎప్పుడూ అమలుకాలేదు. బాకులో జరుగుతున్న చర్చల నుంచి అర్జెంటీనా ప్రతినిధులు వాకౌట్ చేశారు. ఆ దేశ అధ్యక్షులు జేవియర్ మిలీ ఆదేశాల మేరకే ప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బాకు నుంచి నిష్క్రమించారు. కాగా, జేవియర్ మిలీ వాతావరణ సంక్షోభాన్ని 'సోషలిస్ట్ అబద్ధం' అని గతంలోనే విమర్శించారు. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో 'పారిస్ ఒప్పందం' నుంచి వైదొలగుతామని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన దగ్గర నుంచి పారిస్ ఒప్పందం భవిష్యత్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్జెంటీనా బాటలో మరిన్ని దేశాలు నడిచే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బాకు సమావేశాలకు దూరంగా ఉండాలని ఫ్రాన్స్ నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఈ సమావేశాలకు మంత్రి అగ్నెస్ రునచెర్ పాల్గొనవల్సి ఉంది. అయితే మంత్రి చివరి క్షణంలో తన పర్యటనను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు.

లెఫ్ట్ ప్రభంజనం

(మొదటి పేజీ తరువాయి)

తొలగించుకున్నట్లైంది. ఎన్నికల ప్రచారంలో ఒక జాతికి వ్యతిరేకంగా మరొక జాతిని ఎగదోసే విచ్ఛిన్నకర రాజకీయాలకు కాలం చెల్లిందని, దేశం ముందున్న గడ్డు సవాళ్లను అందరం కలసి ఎదుర్కొందామని దేశాధినేత దిసనాయకె ఇచ్చిన పిలుపునకు ప్రజలు సానుకూలంగా స్పందించారు. అలాగే దేశ ఆర్థిక, రాజకీయ రంగాల్లో వినూత్న మార్పులు తెచ్చేందుకు తనకు పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీ ఇవ్వాలని ఆయన చేసిన విజ్ఞప్తిని మన్నించి అసాధారణ విజయం చేకూర్చారు. 'బళు ఓడలవుతాయి.. ఓడలు బళ్లు అవుతాయ'న్న నానుడి నిజం చేస్తూ గత పార్లమెంటు ఎన్నికల్లో కేవలం మూడు స్థానాలకే పరిమితమైన లెఫ్ట్ కూటమి ఈ సారి 160 సీట్లు (దామాషా పద్ధతిలో లభించిన సీట్లను కూడా కలుపుకుని) సాధించగా, గత పార్లమెంటులో 145 స్థానాలు కలిగివున్న మాజీ దేశాధ్యక్షులు మహిందా రాజపక్స నేతృత్వంలోని శ్రీలంక పీపుల్స్ ఫ్రంట్ ఈసారి రెండు సీట్లతో సరిపెట్టుకుంది. గత సారి 54 స్థానాలు సాధించిన సామాగి జన బలవేగయా (ఎస్‌జెబి) పార్టీ ఇప్పుడు 40 స్థానాలతో సరిపెట్టుకుంది. రెండవ అతి పెద్ద పార్టీ అదే కాబట్టి ప్రతిపక్ష హోదా దక్కించుకుంది. ఇక దేశాధ్యక్ష ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన పూర్వ అధ్యక్షులు రణిల్ విక్రమ సింఘె పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే సాహసం చేయలేదు. ఆయన నాయకత్వంలోని డెమొక్రటిక్ ఫ్రంట్ పోటీ చేసి నాలుగు స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. మరో మాజీ అధ్యక్షులు మహింద రాజపక్సె పార్టీకి రెండు సీట్లు మాత్రమే దక్కాయి. 1948లో బ్రిటిష్‌వారి నుండి స్వాతంత్ర్యం పొందిన తరువాత గత ఏడు దశాబ్దాలుగా దేశాన్ని ఏలుతూ వచ్చిన ప్రధాన సాంప్రదాయక పార్టీలకు ప్రజలు కీలెరిగి వాత పెట్టారు. 2002లో శ్రీలంకను కుదిపేసిన మహా ఆర్థిక సంక్షోభానికి ఈ పార్టీలు అనుసరించిన నయా ఉదారవాద విధానాలే కారణం. దీనికి ప్రత్యామ్నాయంతో ముందుకొచ్చిన జనతా విముక్తి పెరమున (జెవిపి) నేత అనూర కుమార దిసనాయకెపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. మార్పు కోసం అధ్యక్ష ఎన్నికల్లో ఎన్‌పిపికి చారిత్రాత్మక విజయం చేకూర్చిన ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లోనూ తిరుగులేని విజయం చేకూర్చారు. ఈ జంట విజయాలతో దిసనాయకె ప్రభుత్వంపై బాధ్యత మరింత పెరిగిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. నేడు శ్రీలంక ముందున్న అతి పెద్ద సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆర్థిక విధానాల్లో మార్పులు తెస్తామని, పేదరిక నిర్మూలన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రభుత్వ వృథా వ్యయాన్ని అరికట్టి అవినీతిపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల ప్రచారంలో దిసనాయకె హామీ ఇచ్చారు. వాటిని నిలబెట్టుకోవడంపైనే ఎన్‌పిపి భవిష్యత్తు ఆధారపడి ఉంది. 2019లో ఏర్పాటైన ఎన్‌పిపికి పార్లమెంటులో తిరుగులేని మెజార్టీ ఉన్నందున ఇంకెంత మాత్రం జాప్యం చేయకుండా దిసనాయకె తన ప్రజానుకూల ఎజెండాతో ముందుకు సాగాలి. ఇప్పుడాయన ముందున్న మొదటి సవాల్ 290 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ బెయిలవుట్ ప్రణాళికను తిరగదోడడం. అలాగే భారత్, చైనాలతో సంబంధాల్లో సమతూకం పాటించడం కూడా విదేశాంగ విధానంలో ఒక ముఖ్యమైన అంశం. శ్రీలంకలో 2.1 కోట్ల మంది జనాభాకు గాను 1.7 కోట్ల మంది నమోదయిన ఓటర్లు ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో 80 శాతం మంది ఓటువేయగా, ఇప్పుడీ ఎన్నికల్లో 70 శాతానికి ఓటింగ్ పడిపోయింది.

ఆశలు నెరవేరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని చెప్పారు. అవికాక, పబ్లిక్ అకౌంట్స్ లయబిలిటీస్ రూ.80,914 కోట్లు, కార్పొరేషన్‌ల అప్పులు రూ.2,48,670 కోట్లు, పౌరసరఫరాలశాఖలో రూ.36 వేల కోట్లు, విద్యుత్ రంగంలో రూ.34,267 కోట్లు, వెండార్స్‌కు చెల్లించాల్సిన బకాయిల కింద 1,13,244 కోట్లు, ఉద్యోగులకు రూ.21,980 కోట్లు, నాన్ కాంట్రిబ్యూషన్ సింకింగ్ ఫండ్ కింద రూ.1,191కోట్లు బకాయిలుగాఉన్నాయని చెప్పారు. 'ఇవి అబద్ధం అని ఎవరు వచ్చినా లెక్కలు చూపిస్తా... గుంజిళ్లు తీయిస్తా' అని అన్నారు. 2019 నాటికి 72 శాతం మేర పోలవరాన్ని పూర్తి చేశామని 2021నాటికి పోలవరం పూర్తి చేసే వాళ్లమని, కానీ వైసిపి అధికారంలోకి రావడం వల్ల పోలవరం నిలిచిపోయిందన్నారు. డయాఫ్రం వాల్ కూలిపోయిన విషయం కూడా గత ప్రభుత్వం గ్రహించలేదన్నారు

విద్యుత్ రంగంలో రూ.1.29 లక్షల కోట్ల నష్టం

2014 నుంచి 2019 మధ్య ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు. వైసిపి హయాంలో ఛార్జీలు పెంచి విద్యుత్ వ్యవస్థలను నాశనం చేశారన్నారు. తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థను దెబ్బతీశారని చెప్పారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ రంగంలో నష్టం వచ్చిందన్నారు. సోలార్, విండ్ ఎనర్జీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం విద్యుత్ తీసుకోలేదని, కోర్టు తీర్పుతో రూ.9 వేల కోట్లు అప్పనంగా ఇవ్వాల్సి వచ్చిందన్నారు. రూ.7.91 పైసలు పెట్టి బయట మార్కెట్‌లో విద్యుత్ కొన్నారని అన్నారు. ఉచిత ఇసుకను రద్దు చేసి నిర్మాణ రంగాన్ని దెబ్బతీశారని, 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని తెలిపారు. ఇసుక ద్వారా రూ.30 వేల కోట్లు దోచుకున్నారని చెప్పారు. మద్యం విధానం ద్వారా జగన్ మనుషులే సొంత బ్రాండ్లను తయారు చేసి అధిక ధరలకు అమ్మి ప్రజలు ఆరోగ్యాన్ని దెబ్బతీశారన్నారు. రహదారులు దెబ్బతిన్నా పట్టించుకోలేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని వారు రూ.430 కోట్లతో రుషికొండపై ప్యాలెస్ నిర్మించుకున్నారని అన్నారు. ఆ బిల్డింగులు చూసి తనకే కళ్లు తిరిగాయని చెప్పారు.

ఆడబిడ్డలకు గౌరవం ఇస్తాం

తమ పాలనలో రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ గౌరవంగా బతికేలా చూస్తామని సిఎం చెప్పారు. టిడిపి కూటమిలోని నేతలు, కార్యకర్తలు ఎవరూ అసభ్య పోస్టులు పెట్టరని, ఒక వేళ పెడితే కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. 'రాబోయే రోజుల్లో ఏ ఆడబిడ్డా అవమానపడటానికి వీల్లేదు. చట్టానికి పదును పెట్టి కఠినంగా శిక్షిస్తాం' అని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో 2014-19 నాటి టిడిపి పాలనకు, ఆ తరువాత అధికారంలోకి వైసిపి పాలనకు మధ్య ఉన్న తేడాలను చంద్రబాబు గణాంకాలతోసహా వివరించారు.

విద్వేష ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్న మోడీ

- ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్

పూణే : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన విద్వేష ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్నారని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ఎన్నికల ప్రచార సభల్లో మోడీ చేస్తున్న ప్రసంగాలు, ప్రస్తావిస్తున్న అంశాలు ఇదే తీరుతో ఉన్నాయని శరద్ పేర్కొన్నారు. ఒక జాతీయ జాతీయ మీడియా సంస్థ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మహాయుతి ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని తెలిపారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు 'విడిపోతే చస్తారు' అనే నినాదంతో ఆదిత్య నాథ్ ప్రజల్లో భయాన్ని, అభద్రతను సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌సిపిని బిజెపి చీలిపోయేలా చేసినా..తమ గ్రూపుదే గెలుపు అని శరద్ పవార్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందగలననే నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వంపై యువత, రైతులు అసంతృప్తితో ఉన్నారని.. అదే తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో తమకు మద్దతు తగ్గుతోందని గుర్తించిన మహాయుతి సర్కారు మహిళలకు డబ్బులు పంచే పథకాలను రూపొందిస్తోందని ఆరోపించారు. కానీ.. మహిళలు డబ్బును చూడరని, అభివద్ధి, భద్రతను కల్పించే ప్రభుత్వాలను ఆదరిస్తారని పేర్కొన్నారు.

భూదురాక్రమణ నిషేధ బిల్లు-2024పై అన్ని పక్షాలతో సంప్రదించండి

(మొదటి పేజీ తరువాయి)

కలిగిన పేద, మధ్యతరగతి రైతులు, సొంత ఇల్లు లేని పట్టణ, గ్రామీణ పేదలు ప్రభుత్వ భూమి కలిగి వుంటే వారికి ఈ చట్టం నుండి మినహాయింపు ఇవ్వాలి. ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములను దౌర్జన్యంగా, అక్రమంగా దురాక్రమణ చేసిన పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, సంపన్నులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దానికి సిపిఎం నుండి సంపూర్ణ మద్దతు ఉంటుంది. కాని 2024 చట్టం (బిల్లు) అందుకు ఉద్దేశించినట్లుగా కనిపించడం లేదు. బిల్లులో అంశాలను పరిశీలిస్తే పై భూకబ్జాదారులకంటే కూడా రాష్ట్రంలో రెక్కల కష్టం మీదే ఆధారపడి జానెడు సొంత ఆస్తిలేని దళితులు, బలహీనవర్గాలకు చెందిన పేదలు ఎక్కడైనా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటున్నా, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకోవడానికి ఉపక్రమిస్తున్నా వారిపై బ్రహ్మాస్త్రం ప్రయోగించేటట్లు ఈ చట్టంలో అంశాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. పేదలను, వారికి అండగా ఉన్న ప్రజా ఉద్యమకారులను అణచివేసి, భూమాఫియాను ప్రోత్సహించేదిగా ఈ చట్టం ఉన్నట్లు అర్థమవుతోంది. నాలుగు దశాబ్దాల అనుభవంలో ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలు దురాక్రమణ చేసిన భూమాఫియాలు ఏ ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు. ఒక్క దళితుడికి తిరిగి భూమి అప్పజెప్పలేదు. ఇప్పుడు మీరు తీసుకువస్తామన్న చట్టం పరిశీలిస్తుంటే పట్టణీకరణ పెరగడం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక అభివృద్ధి అనే పేరుతో నగరాలకు, మండల కేంద్రాలకు ఆనుకుని ఉన్న, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను బడా పెట్టుబడిదారులకు, సంపన్నులకు, రాజకీయ నాయకులకు కట్టబెట్టడానికే ఈ తరహా చట్టం తోడ్పడుతున్నట్లు గుజరాత్ అనుభవం తెలియజేస్తోంది. అందువల్ల పేదలకు న్యాయం జరిగే విధంగా ఈ చట్టాన్ని సవరించాలి.

బిల్లులో అభ్యంతరకరమైన అంశాలు

సెక్షన్ -2 (డి, ఇ)లో భూములను అక్రమంగా స్వాధీనం చేసుకొనుటకు లేదా నిర్మాణములను చేపట్టుటకు ఎవరైనా ప్రభుత్వ, దేవాలయ, వక్ఫ్ ప్రైవేట్ భూములను స్వాధీనం చేసుకొంటే వారికి 10 నుంచి 14 సంవత్సరాలు జైలు శిక్ష, మార్కెట్ రేటు ప్రకారంగా పరిహారం చెల్లించాలని పొందుపరిచారు. అదేవిధంగా ఎవరైనా పెద్దలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇస్తే తెలిసో, తెలియక ఆ భూమిని కౌలుకు తీసుకున్న దళితులు, బలహీన వర్గాల పేదలు కూడా దోషులే అని వీరికి కూడా జైలు శిక్ష విధిస్తామని పేర్కొన్నారు. ఈ లెక్కన తలదాచుకోవడానికి జానెడు స్థలం లేని పేదలు, గ్రామీణ ప్రాంతాల్లో పొట్టపోసుకోవడానికి ప్రభుత్వ భూములను సాగు చేసుకోవడానికి ఉపక్రమించిన పేదలు కూడా భూ ఆక్రమణదారులే అవుతారు. వారికి కూడా శిక్షలు విధిస్తారు. ఇది పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడం లాంటిదే.

సెక్షన్ -4లో (1) ఏ వ్యక్తులైనా, ఏ వ్యక్తైనా ఇతరులచే భూ దురాక్రమణ చేయరాదు. చేయించరాదు. అని చెప్పారు. ఈ సెక్షన్ ప్రకారంగా నిరుపేదల పక్షాన నిలబడి పోరాడుతున్న ప్రజా ఉద్యమకారులను, పేదల తరపున మాట్లాడే సంఘాల, పార్టీల కార్యకర్తలపై కక్షగట్టి శిక్ష విధించి ప్రజా ఉద్యమాలను అణచడానికి విధించినదిగా ఉంది. ఈ సెక్షన్‌ని ఎత్తివేసి సంపన్నులను, పలుకుబడికలిగిన అనర్హులకు శిక్ష విధించేలా మార్పులు చేయాలి.

సెక్షన్-5లో (4) పలుకుబడిన కల్గినవారు ఆక్రమించుకొని ఆ స్థలంలో నిర్మాణం చేపట్టే భవనాలలో కడుపుకూటి కోసం పని చేసే కార్మికుల పైన చర్యలు తీసుకోవడమనేది అత్యంత దుర్మార్గమైనది. దీనిని పూర్తిగా ఎత్తివేయాలి.

సెక్షన్ -6లో (1) పెట్టుబడిదారులు ఆక్రమించుకుంటే మేనేజ్‌మెంట్‌కు తెలియకుండా ఆక్రమణ జరిగిందని యాజమాన్యం నిరూపిస్తే శిక్ష నుండి మినహాయింపు ఇచ్చారు. దీనిని బట్టి పేదలపై ఉక్కుపాదం మోపి పెట్టుబడిదార్లకు చట్టబద్ధం ఇచ్చే ఈ మినహాయింపు దురాక్రమణదారులను ప్రోత్సహించడమే. దురాక్రమణకు యజమానులను బాధ్యులను చేయాలి.

సెక్షన్-7లో (2) న్యాయస్థానం ఆరునెలల్లో పరిష్కారం చేయకపోతే తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పచెప్పాలన్నారు. న్యాయస్థానం నుండి తప్పించడం అధికారంలో ఉన్న పార్టీ నాయకుల ఇష్టాయిష్టాల ప్రకారం ప్రజలకు అన్యాయం జరుగుతోంది. దీనిని రద్దు చేయాలి.

పై విషయాలను పరిశీలించిన తర్వాత 1982లో తెచ్చిన భూ ఆక్రమణ నిషేధ చట్టం పరిశీలించినా, 9/77 అసైన్డ్ (భూ బదలాయింపు నిషేధం) చట్టం పరిశీలించినా, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు పరిశీలించినా గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో అక్రమంగా, దౌర్జన్యంగా, రాజకీయ పలుకుబడితో ప్రభుత్వ, పేదల భూములను ఆక్రమించిన ఒక్కరిపైన కూడా ఈరోజు వరకూ ఏ ప్రభుత్వమూ చర్య తీసుకోలేదు. జైలుకు పంపలేదు. తద్విరుద్ధంగా పేదలను, వారి పక్షాన నిలబడిన ఉద్యమకారులనే జైలుకు పంపించారు. అదేవిధంగా తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సభలు జరిపి అన్యాక్రాంతమైన పేదల భూములను బయటికి తీసి తిరిగి పేదలకు ఇస్తామని, అనర్హులపై చర్య తీసుకుంటామని చెప్పారు. కాని నేటికి ఒక్క పేదవాడికి భూమి దఖలు పరచలేదు.' అని వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాము చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని ప్రతిపాదిత బిల్లులో మార్పులు తీసుకువస్తారన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

జిఎస్‌టి పెంపునకు అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇవ్వాలని నిర్మలా సీతారామన్‌ను కోరారు. అలాగే గోదావరి-పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థిక సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

కాగా రాష్ట్ర రాజధాని అమరావతిలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను చంద్రబాబు కోరారు. అమెరికాలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో భారత్‌పై దాని ప్రభావం తదితర అంశాలపైనా ఆయనతో చర్చించారు. ఇమ్మిగ్రేషన్ తదితర దౌత్య సంబంధిత వ్యవహారాల్లో తెలుగు ప్రజలకు, ప్రధానంగా విద్యార్థులకు సహకరించాలని ఆయన కోరారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలను తమ రాష్ట్రానికి పంపాలని, తాము అన్ని విధాలా ప్రోత్సహకాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

కేంద్ర మంత్రులతో చంద్రబాబు భేటీల సారాంశాన్ని టిడిపి ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్, పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు మీడియాకు వివరించారు. జిఎస్‌టి శాతం పెంపు, గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి సాయం అందించేందుకు నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే వీసాలు, ఇతర ఇమ్మిగ్రేషన్ వ్యహారాల్లో తెలుగు ప్రజలకు సహకరిస్తామని చంద్రబాబుకు జైశంకర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో నేడు ప్రచారం

ఢిల్లీలో శనివారం జరిగే హిందూస్తాన్ టైమ్స్ వందేళ్ల వార్షికోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ పాల్గొంటారు. అక్కడ నుంచి ముంబయి వెళ్లి మహారాష్ట్రలో ఎన్‌డిఎ తరపున జరిగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఆదివారం సాయంత్రం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.



మీకోసం

పిండి వంటకాల్లో నూనె పొంగుతున్నట్లయితే ఆ నూనెలో తమలపాకులు వేయాలి.

జీవన సౌరభం

చిన్నప్పుడు మంచి అలవాట్లు చేసుకుంటేనే పెద్దయ్యాక గొప్ప లక్ష్యాలను సాధించగలరు.

బాలలంటే బాలలు

కల్మషం లేని మనసు కలవారు బాలలు
చెప్పిన మాట ఆచరించే వారు బాలలు
ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేవారు బాలలు
చిలిపి పనులు చేసేవారు బాలలు
నిరంతరం చిరునవ్వు చిందించేవారు బాలలు
ఆటలలో ముందుండేవారు బాలలు
ఆహ్లాద వాతావరణం సృష్టించేవారు బాలలు
పెద్దల ముఖంలో ఆనందం తెచ్చేవారు బాలలు
బుడిబుడి అడుగుల బుజ్జాయిలు బాలలు
అల్లరి చేసే పిడుగులు బాలలు
తల్లి ప్రేమకు లోబడేవారు బాలలు
చీమటపాసుల వలె చిందులేసేవారు బాలలు
మిలమిల మెరిసే తారాజువ్వలు బాలలు
చిందులు వేసే చిన్నారులు బాలలు
పాలవంటి స్వచ్ఛమైన మనసు కలవారు బాలలు
తోటలోని అందమైన మల్లెలు బాలలు





- చెరుకూరి కార్తీక,
10వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.



లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ



డి.అశ్విత,
9వ తరగతి,
జి.ప.ఉ.పా. నర్సింహుల పల్లి,
పెద్దపల్లి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విజ్ఞానంతోనే వికసించు జగత్తు ...

- ఆ మధ్య పూణేలో పన్నెండేళ్ల విద్యార్థి రెంతస్తుల భవనం మీద నుంచి దూకి తీవ్రంగా గాయపడ్డాడు. సెల్ ఫోన్లో బ్లూవేల్ గేమ్ ఆడుతూ, చాలెంజిలో భాగంగా పై నుంచి దూకేశాడు.
- మహారాష్ట్రలో పదమూడేళ్ల బాలుడు ఎత్తయిన భూభాగం నుంచి లోయలోకి ఉరికాడు. హనుమాన్ చాలీసా పఠిస్తూ, దూకితే, గాల్లో ఎగరవచ్చునని అతడు భావించాడు.
- నీటి కొలనులో ఈత నేర్చుకుంటున్న ఇద్దరు పిల్లలు ఈత వచ్చులే అన్న ధీమాతో నది మధ్యలోకి వెళ్లి, ప్రమాదంలో చిక్కుకుపోయిన సంఘటన ఇటీవల తెలంగాణాలో జరిగింది.

కథలకు, ఊహలకు, వాస్తవాలకు మధ్య ఉన్న తేడా గురించి పిల్లలకు స్పష్టంగా తెలియాలి. అప్పుడు మాత్రమే ఇలాంటి అవాంఛిత పరిస్థితులనుంచి బయటపడగలుగుతారు. పిల్లలు ఎదుగుతున్న క్రమంలో ప్రతిదీ నేర్చుకుంటారు. ఆ నేర్చుకోవడంలో కథలూ, ఊహలూ వాస్తవాన్ని అర్థం చేసుకోవటానికి దోహదపడాలి తప్ప– ఆ వాస్తవానికి విరుద్ధంగా ఉండకూడదు. అందువల్లనే చదువులో శాస్త్రీయ దృక్పథం ఉండాలి. ఏది నిజమో అదే పిల్లలకు తెలియాలి. ప్రకృతిలోని ప్రతి చర్య వెనుకా ఒక క్రమబద్ధమైన కారణం ఉంటుందని తెలియాలి. మహత్తుల వల్ల, నమ్మకాల వల్ల ఏదీ జరగదని తెలియజెప్పాలి. ఎవరికి ఏ నమ్మకం ఉన్నా వారంతా వాస్తవంలోనే బతుకుతారు. శాస్త్రీయ దృక్పథం ఆధారంగా రూపొందిన వస్తు సముదాయపు సహకారంతోనే జీవిస్తారు. తమ నమ్మకాలను సైతం సైన్సు ఆధారంగా రూపొందిన పుస్తకాల ద్వారా, పత్రికల ద్వారా, మైకుల ద్వారా, ఇంటర్నెట్ ద్వారానే ప్రచారం చేసుకుంటారు. మానవ శ్రమ, మేధ తయారుచేసిన వస్తువులను మాత్రమే వారూ వాడతారు. అందుకు అతీతమైన, భిన్నమైన మహత్తు వస్తువులు, ప్రత్యామ్నాయ పద్ధతులూ వారి వద్ద ఉండవు. మరి దృశ్యం ఇంత స్పష్టంగా మన కళ్లకు కనపడుతున్నప్పుడు – పిల్లలను అమోమయానికి గురి చేసే నమ్మకాల వైపు ఎందుకు మళ్లించాలి?

పిల్లల్లో ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. దానినే 'విజ్ఞాన జిజ్ఞాస' అంటారు. ఎందుకు? ఏమిటి? ఎలాగ? ఎప్పుడు? వంటి కొడవలి మార్కు కొశ్నెలను పిల్లలు నిరంతరంగా సంధిస్తారు. వాటికి ఓపికగా



జవాబులు చెబుతూ ఉంటే, మళ్లీ మళ్లీ అడిగి మరిన్ని విషయాలు తెలుసుకుంటారు. ఆ జవాబుల్లో సైన్సు ఉంటే, పిల్లలు శాస్త్రీయంగా ఆలోచిస్తారు. చాదస్తం నూరిపోస్తే అందుకు అనుగుణంగానే తయారవుతారు.

మనుషులు తొలినుంచీ విజ్ఞాన జిజ్ఞాసతో ఆలోచిస్తూ ఉన్నారు కాబట్టే– రాతియుగం నుంచి రాకెట్టు యుగం దాకా ప్రస్థానం సాగించారు. "ఇది ఇంతే! ఇదిలాగే ఉంటుంది.. ఎవరూ ప్రశ్నించకూడదు. ఎవరూ గొంతెత్తకూడదు." అనుకుంటే– మనమింకా పురాతన కాలంలోనే ఉండేవాళ్లం. మిగతా జంతు సమూహాలన్నిటి కన్నా మనుషులు తెలివైన వారు కాబట్టి, మెదడు అభివృద్ధి చెందిన వారు కాబట్టి– ఆలోచించకుండా ఉండలేరు. చుట్టూ ఉన్న పరిస్థితులను పట్టించుకోకుండా ఉండలేరు. ప్రశ్నించకుండా, పరిష్కరించకుండా అసలే ఉండలేరు. అచేతనంగా ఉండలేని చైతన్యంలోనుంచే నూతన భావాలు, ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి. పురాతన భావాలూ, పద్ధతులూ కాలగర్భంలో కలిసిపోతాయి. ఇది నిత్యం మన కళ్లముందు జరుగుతూనే ఉంది.

పక్షుల వలె గాలిలో ఎగరాలని, చంద్రుడి మీదికి చేరాలని, చేపల వలె నీటిపై చరించాలని ఆదిమ కాలపు మనుషుల ఆశ. ఆ ఆశ ఆలంబనగానే అనేక ఊహలను, కథలను అల్లుకున్నారు.

ఆధునిక కాలంలో కొందరు ఆ కలలను వాస్తవంలోకి తెచ్చే అనేక ప్రయత్నాలు చేశారు. పక్షుల వలె భుజాలకు రెక్కలను కట్టుకొని గాల్లో ఎగిరే ప్రయత్నం చేశారు. ఎందరో గాయపడ్డారు. కొందరు ప్రాణాలను సైతం కోల్పోయారు. మనిషి తనకు తానుగా ఎగరలేడని వందేళ్ల క్రితమే నిర్ధారణకు వచ్చారు. పక్షులు ఎగరటానికి, చేపలు ఈదటానికి ఏఏ ప్రత్యేకతలు అనుకూలిస్తున్నాయో అధ్యయనం చేశారు. ప్రతి చర్య వెనుకా, సామర్థ్యం వెనుకా ఒక ప్రత్యేకమైన సూత్రం ఉంటుందని కనుగొన్నారు. వాటి ఆధారంగా విమానాలను, ఓడలను నిర్మించుకున్నారు. సూత్రబద్ధత అంటే సైన్సు.

విమానం, రాకెట్టు, ఓడ, కారు, టూవీలరు, కుక్కరు, మిక్సీ, ట్యూబులైటు, టెలివిజన్, సెల్‌ఫోను ... ఇలాంటి సర్వ వస్తు సామగ్రి సైన్సు సూత్రాల ఆధారంగానే నడుస్తున్నాయి. ఆధునిక కాలంలో ఇంత దూరం వచ్చాక, పురాతన కాలంలోనే గొప్పగా ఉన్నామన్నట్టుగా ప్రచారం చేసుకోవటం ఆత్మవంచన అవుతుంది. ముఖ్యంగా రేపటి పౌరులుగా, సమాజ నిర్మాతలుగా ఎదగాల్సిన పిల్లల మనసుల మీద ప్రతికూలంగా ప్రభావం పడుతుంది. పురాణ కథలను కథలుగానే పిల్లలకు పరిచయం చేయాలి. వాటినిండా అద్భుతాలు, అతీత శక్తులూ నిజంగానే ఉన్నట్టు నూరిపోయకూడదు. అలా తల్లిదండ్రులు నూరిపోసిన ఫలితంగానే మహారాష్ట్రలో పదమూడేళ్ల అబ్బాయి మంత్రాలు పఠిస్తే ఆకాశంలో ఎగరొచ్చని భ్రమపడ్డాడు. ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. సైన్సు సూత్రాల మీద అవగాహన పెరిగితే పిల్లలు ప్రమాదాలను కొని తెచ్చుకోరు. పురాణ పాత్రలనైనా, సూపర్‌మ్యాన్ లాంటి కల్పిత పాత్రలనైనా పిల్లలు వినోదంగా తీసుకోవాలి తప్ప – అవి నిజంగానే వచ్చి రక్షిస్తాయన్నట్టుగా భావించకూడదు. వికసిస్తున్న పిల్లల మెదళ్లలోకి మూఢ నమ్మకాలు, అతి నమ్మకాలు పాకకుండా



చూడాల్సిన బాధ్యత పెద్దలదే!

ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రాచుర్యంలోకి వచ్చాక మూఢత్వాన్ని జొప్పించే బాధ్యతారాహిత్యం కూడా ఎక్కువగా ప్రబలుతోంది. టీవీల్లో వచ్చే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అత్యధికం అతీత శక్తుల పట్ల నమ్మకాన్ని పెంచేవిగా ఉంటున్నాయి. రంగురాళ్లూ రత్నాలూ, అదృష్ట సంఖ్యలూ, దోష నివారణా పథకాలు తెప్పలుగా ప్రవహిస్తున్నాయి. వీటి బారిన పిల్లలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో కన్నా కూడా ఈ ఇంటర్నెట్ కాలంలో పిల్లలను అచేతనంగా, అజ్ఞానంగా మార్చే ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. శాస్త్రీయ జ్ఞానాన్ని, దృక్పథాన్ని పెంచే ప్రయత్నం తల్లిదండ్రుల నుంచి, ఉపాధ్యాయుల నుంచి మరింత ఎక్కువగా జరగాలి. నమ్మకాలకు, నాగరిక జీవనానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉందన్న సంగతిని ఎరుక పర్చాలి. విజ్ఞానంతోనే ప్రపంచం పురోగమిస్తుందని, పురాతన భావాలు దానిని వెనక్కు లాగుతాయని వివరించాలి.



వరుస సినిమాలతో నాని



శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రస్తుతం నాని హిట్ 3 చిత్రాన్ని చేస్తున్నారు. ఈ చిత్రం 2025 వేసవికి విడుదల కానుంది. శ్రీకాంత్ ఒదెలతో కూడా ఓ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రారంభంలో షూటింగ్‌కి వెళుతుంది. సుజీత్‌తో యాక్షన్ సినిమా కోసం కూడా చర్చలు నడుస్తున్నాయి. ఈ చిత్రం కూడా వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది. ఈ చిత్రాలను పూర్తి చేసిన తర్వాత మలయాళ దర్శకుడు విపిన్ దాస్ దర్శకత్వంలో నాని ఓ సినిమా చేయనున్నారు. ఈ సినిమా 2026లో ప్రారంభమవుతుంది.

'భైరవం' దివ్య పిళ్లై



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా దివ్యా పిళ్లై క్యారెక్టర్‌కు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. 'ప్రతిభ గల నటి దివ్యా పిళ్లైను పరిచయం చేస్తున్నాం. 'భైరవం' మూవీలో ఈ బంగారు బొమ్మ 'పూర్ణిమ'గా మీ ముందుకు రాబోతోంది. ఆమె తన నటనతో మీ అందరినీ ఆశ్చర్యపరచడానికి సిద్ధంగా ఉంది. తదుపరి అప్‌డేట్ కోసం వేచి ఉండండి' అనే క్యాప్షన్ ఇచ్చి ఈ ఫొటోని షేర్ చేశారు.

'డాకు మహారాజ్' టీజర్ విడుదల

బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'డాకు మహారాజ్'. గత కొన్నిరోజులుగా టైటిల్‌పై నెలకొన్న ఊహాగానాలను బ్రేక్ చేస్తూ చిత్ర యూనిట్ ఈ టైటిల్‌ను ఖరారు చేసింది. బాబీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. దాదాపు 96 సెకన్ల నిడివి ఉన్న టీజర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఇందులో బాలయ్య నల్లని గుర్రంపై కనిపించారు. తమన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా చక్కగా ఇచ్చారు. 'ఈ కథ వెలుగుని పంపే దేవుడిది కాదు. చీకటిని శాసించే రాక్షసులది కాదు. ఆ రాక్షసులని ఆడించే రావణుడిది కాదు. ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఓ రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మరాజుది. మరణాన్నే వణికించిన మహారాజుది' అనే వాయిస్ ఓవర్ అనగానే...'మహారాజ్, డాకు మహారాజ్' అని బాలకృష్ణ చెప్పటం ఆకట్టుకుంది. ఈ సినిమాలో బాలకృష్ణతోపాటుగా చౌందిని చౌదరి, ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, బాబీడియోల్ తదితరులు నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ఈ సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు.





'సూర్య 44' యాక్షన్‌తో ఉన్న ప్రేమ కథ

సూర్య, కార్తీక్ సుబ్బరాజు కాంబినేషన్లో వస్తున్న చిత్రం 'సూర్య 44'. ఈ సినిమా ఎలా ఉండబోతుందో ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ సుబ్బరాజు స్పష్టం చేశారు. 'ఈ చిత్రం గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు. ఇది చాలా యాక్షన్ పార్ట్‌తో కూడిన ప్రేమకథ. సూర్య అండ్ పూజా హెగ్డే లాంటి నటీనటులతో లవ్ స్టోరీ చేస్తున్నానని చాలా ఎక్జయిట్‌మెంట్ ఫీలవుతున్నాను' అని చెప్పారు. ఈ చిత్రంలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. జోజు జార్జ్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రానికి ఇసంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నారు. సూర్య హోం బ్యానర్ '2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్' నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని 2025 పొంగళ్ కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే అండమాన్ ఐలాండ్‌లో లాంగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు.

'సాహిబా' పాటలో విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ నటించిన మ్యూజిక్ ఆల్బమ్ పూర్తి సాంగ్ వీడియోను యూట్యూబ్‌లో విడుదల చేశారు. 'సాహిబా' అనే పాట కోసం రాధిక మదన్‌తో కలిసి విజయ్ కనిపించారు. బాలీవుడ్ సింగర్ జస్లిన్ రాయల్ ఈ పాటను కంపోజ్ చేశారు. ఆరేళ్ల క్రితం 'నీ వెనకాలే నడిచి' అనే సాంగ్‌కోసం ఆయన పనిచేశారు. 2018లో యూట్యూబ్‌లో విడుదలైన 'హీరియే' సాంగ్ అప్పట్లో బాగానే ఆకట్టుకుంది.



ఎన్టీఆర్ కోసం పాదయాత్ర



నటుడు ఎన్టీఆర్‌కు వీరాభిమానులైన కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండలం సోడిగానిపల్లి గ్రామ పంచాయతీ పాలెం గ్రామానికి చెందిన శివ, హరి, లక్ష్మీపతి, కదిరప్పలు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చారు. వీరంతా ఈనెల 3న తమ ఇంటి నుంచి హైదరాబాద్‌లోని జూనియర్ ఎన్టీఆర్ నివాసం వరకూ 'వేసే ప్రతి అడుగు జూనియర్ ఎన్టీఆర్ అన్నకోసం' పేరుతో ఈ పాదయాత్ర ప్రారంభించారు. 13 రోజుల తర్వాత హైదరాబాద్‌కు చేరుకుని జూనియర్ ఎన్టీఆర్‌ను కలిశారు. ఆయన వారిని కలిసి అభినందనలు తెలిపారు. కుప్పం జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శివరాయల్ పాదయాత్ర చేపట్టిన అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

రికార్డుపుటల్లో తిలక్, సంజు

- ఒక టి20లో ఇరువురు భారత బ్యాటర్లు సెంచరీలు
- దక్షిణాఫ్రికాపై 135 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
- సిరీస్ 3–1తో భారత్ కైవసం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాల్గో, చివరి టి20లో భారత్ 135 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత తిలక్ వర్మ, సంజు శాంసన్ రికార్డు సెంచరీలతో రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 283పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టు 18.2ఓవర్లలో 148పరుగులకు కుప్పకూలింది. దీంతో నాలుగు టి20ల సిరీస్‌ను టీమిండియా 3–1తో చేజిక్కించుకుంది.

వాండెరర్స్ స్టేడియంలో టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 73 పరుగులు జోడించి శుభారంభం అందించారు. 36 పరుగులు చేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి వికెట్ రూపంలో వెనుదిరిగాడు. ఆ తర్వాత సంజు శాంసన్‌కు తిలక్ వర్మ జతకలవడంతో వాండరర్స్ స్టేడియంలో పరుగుల సునామీ వచ్చింది. ఈ జోడీ పిడుగుల్లాంటి షాట్లతో విరుచుకుపడడంతో సఫారీ బౌలర్ల పరిస్థితి



దయనీయంగా మారింది. సంజూ, తిలక్ పోటాపోటీగా సెంచరీలు పూర్తి చేసుకోవడం విశేషం. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో సెంచరీ సాధించిన సంజూ శాంసన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయి, మళ్లీ నాలుగో మ్యాచ్‌లో సెంచరీ నమోదు చేయగా... తిలక్ వర్మ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో శతక్కొట్టాడు. తిలక్ వర్మ సెంచూరియన్‌లో జరిగిన మూడో టీ20లోనూ సెంచరీ చేయడం తెలిసిందే. తిలక్ వర్మ 41బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకోగా... సంజూ శాంసన్ 51బంతుల్లో శతకం నమోదు చేశాడు. తిలక్ వర్మ మొత్తం 47బంతులు ఎదుర్కొని 9ఫోర్లు, 10సిక్సర్లతో 120 పరుగులు చేయగా... సంజు శాంసన్ 56బంతుల్లో 6ఫోర్లు, 9సిక్సర్లతో 109 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్ సిపమ్లాకు ఒక వికెట్ దక్కింది.

ఛేదనలో భాగంగా దక్షిణాఫ్రికా 10 పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో స్టబ్స్(43), డేవిడ్ మిల్లర్(36) కలిసి 5వ వికెట్‌కు 86పరుగులు జోడించారు. వీరిని వరుణ్ చక్రవర్తి విడదీశాడు. జాన్సన్(29) మినహా మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. టీమిండియా బౌలర్లు ఆకాశ్‌దీప్‌కు మూడు, అక్షర్, వరుణ్ చక్రవర్తికి రెండేసి, హార్దిక్, రమణ్‌దీప్ సింగ్, బిష్ణోయ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో టి20 సిరీస్ భారత్ వశమైంది.

వేలం రేసులో 574మంది

ఐపిఎల్ షార్ట్ లిస్ట్ ఇదే! ఆర్చర్, ఆండర్సన్ ఔట్..

ముంబయి: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) షార్ట్ లిస్ట్ విడుదలైంది. సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా ఈనెల 24, 25న జరిగే వేలం రేసులో 574మంది మాత్రమే మిగిలారు. వీరిలో 366మంది భారత ఆటగాళ్లు కాగా.. 208మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. ఇంగ్లండ్ స్టార్ ఆటగాళ్లు జోఫ్రా ఆర్చర్, సీనియర్ ఆటగాడు జేమ్స్ ఆండర్సన్‌లకు ఐపిఎల్ షార్ట్ లిస్ట్‌లో చోటు దక్కలేదు. అలాగే గాయం కారణంగా ఆసీస్ స్టార్ ఆటగాడు కామెరాన్ గ్రీన్ కూడా ఈసారి వేలం బరిలో లేడు. అతడు రూ.17కోట్లతో ముంబయి నుంచి నిష్క్రమించాడు. 10 ఫ్రాంచైజీలు కలిసి మొత్తం 204ఆటగాళ్లను కొనుగోలు చేసుకోవాల్సి ఉండగా.. ఇందులో 70మంది విదేశీ ఆటగాళ్లకు చోటు దక్కనుంది. ఈసారి వేలం రేసులో మొత్తం 1574మంది ఆటగాళ్లు నమోదు చేసుకున్న సంగతి తెలిసిందే. తొలుత ఈ సంఖ్యను 1000కి తగ్గించగా.. తాజాగా 574మందితో మాత్రమే షార్ట్ లిస్ట్‌ను ఐపిఎల్ నిర్వాహకులు వెల్లడించారు.

ఆటగాళ్ల షార్ట్ లిస్ట్...

అంతర్జాతీయ క్రికెట్ ఆడిన భారత ఆటగాళ్లు	: 48
అంతర్జాతీయ క్రికెట్ ఆడిన విదేశీ ఆటగాళ్లు	: 193
అసోసియేట్ ఆటగాళ్లు	: 3
అంతర్జాతీయ క్రికెట్ ఆడని భారత ఆటగాళ్లు	: 318
అంతర్జాతీయ క్రికెట్ ఆడని విదేశీ ఆటగాళ్లు	: 12

రషీద్ డబుల్ సెంచరీ

ఆంధ్ర 448/9 • హైదరాబాద్‌తో రంజీట్రోఫీ

హైదరాబాద్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు బ్యాటర్ షేక్ రషీద్ డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో మూడోరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రజట్టు 9వికెట్ల నష్టానికి 449పరుగులు చేసింది. రషీద్(203) డబుల్ సెంచరీకి తోడు కరణ్ షిండే(109) పరుగులతో రాణించారు. వీరిద్దరూ 3వ వికెట్‌కు 236పరుగులు జతచేశారు. ఆ తర్వాత శ్రీకర్ భరత్(33), సందీప్(33) ఫర్వాలేదనిపించారు. ఆంధ్రజట్టు చివరి 4వికెట్లను కేవలం 36పరుగుల్లోపే చేజార్చుకుంది. అంతకుముందు హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 301పరుగులకే పరిమితం కావడంతో ఆంధ్ర జట్టుకు ఇప్పటికే 147పరుగుల ఆధిక్యత లభించింది. హైదరాబాద్ బౌలర్లు అంకిత్‌రెడ్డికి నాలుగు, మిలింద్, రక్షణ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

కాంబోజ్‌కు 10 వికెట్లు: 39 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి

రంజీ ట్రోఫీలో హర్యానా పేసర్ అన్షుల్ కాంబోజ్ చరిత్ర సృష్టించాడు. రోహ్‌తక్ వేదికగా కేరళతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో కాంబోజ్ 10 వికెట్లతో చెలరేగాడు. 30.1 ఓవర్లు బౌలింగ్ చేసిన కాంబోజ్.. 49 పరుగులిచ్చి మొత్తం 10 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా రంజీ ట్రోఫీ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు పడగొట్టిన మూడో బౌలర్‌గా అన్షుల్ రికార్డులకెక్కాడు. అంతకు ముందు బెంగాల్ దిగ్గజం ప్రేమాంగ్షు ఛటర్జీ 1956–57 సీజన్‌లో అస్సాంపై ఈ ఫీట్‌ను తొలుత సాధించగా.. 1985–86 సీజన్‌లో విదర్భపై రాజస్తాన్ బౌలర్ ప్రదీప్ సుందరం 10 వికెట్లు పడగొట్టాడు.



ఆర్డీటీ మైదానంలో జరుగుతున్న ఫుట్‌బాల్ మ్యాచ్

తమిళనాడు, కర్ణాటక గెలుపు

సంతోష్ ట్రోఫీ

ప్రజాశక్తి–అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్(ఎపిఎఫ్ఎ) ఆధ్వర్యంలో జాతీయ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2024 అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం ప్రారంభం అయ్యింది. టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలి రోజు రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం తమిళనాడు, అండమాన్ నోకోబార్ జట్ల మధ్య జరగ్గా మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్, కర్నాటక జట్ల మధ్య జరిగింది. ఉదయం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఏడు గోల్స్‌ను తమిళనాడు జట్టు చేసింది. మొదటి సెషన్‌లోనే ఐదు గోల్స్ వేయగా రెండో సెషన్‌లో రెండు గోల్స్ వేసింది. అండమాన్ నోకోబార్ జట్టు ఒక్క గోల్ కూడా వేయలేకపోయింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో కర్నాటక విజయం సాధించింది. నిర్ణీత సమయంలోనూ కర్నాటక జట్టు ఐదు గోల్స్ వేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఒక్క గోల్ వేయలేకపోయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68